CP 04 A 128 1

"స్వామీ...."

దిగ్గున తలతిప్పి చూసిన లలిత క్షణకాలం ఆశ్చర్యపోయి 'ఏవండీ..' అని మాత్రమే అనగలిగింది.

"స్వామి...స్వామి..." కొత్తగా పలుకుతున్నట్టు నోటిపెదవులు కదిలించాడు క్రిష్ణమూర్తి.

తనని అలా పిలుస్తున్నట్టో పిలమన్నట్టో అర్థం కాని లలిత రెండుచేతులూ జోడించి ఏ మాటా పెగలక నిలబడింది.

'స్వామియే శరణమయ్యప్ప' అని రెండుచేతులూ పైకెత్తి నమస్కారం చేసి, చేతులు దించి "భిక్ష... భిక్ష పెట్టు" అన్నాడు క్రిష్ణమూర్తి.

"అమ్మా...నాన్నే! అక్కా....నాన్నే!" గోపీ అరిచాడు.

"అవున్నాన్నే...నాన్నే..." పరిగెత్తుకుంటూ వచ్చిన గీత అరిచింది.

తన చేతులు పట్టుకొని పైపైకి రాబోతున్న పిల్లల్ని వారించి... విదిలించి "మణికంఠుల్లారా... అలా పిలవకూడదు... స్వామి...స్వామి..." అంటూ బోధపరచబోయాడు క్రిష్ణమూర్తి.

"ఒరే, నాన్న మాలవేసార్రా... కద నాన్నా.." అర్థం చేసుకుంటూ అడిగింది గీత.

"స్వామియే శరణమయ్యప్ప... స్వామి....స్వామి...." గింజులాడేడు క్రిష్ణమూర్తి.

లలితపిల్లలిద్దర్నీ వెనక్కిలాగి "ఏమండీవుండండి..అయ్యో.. తప్పయిపోయింది... స్వామి... స్వామి... వుండండిస్వామి, భిక్ష తెచ్చిపెడతాను..." అంటూ గదిలోకి వెళ్తుంటే "నిన్న తెచ్చినవే. అవే... అలాగే ఇచ్చెయ్యి... ఆఫీసులో వండుకుంటాము..." అన్నాడు క్రిష్ణమూర్తి.

క్రిష్ణమూర్తి వేసుకున్న నల్లనిదుస్తుల వంక మెడలోని రుద్రాక్షమాల వంక నుదిటిమీద చందనం పై వుంచిన కుంకుమవంక తేరిపార చూస్తూ వున్నాడు గోపి. బుర్రలో బుట్టెడు ఆలోచనలూ అనుమానాలూ...

"నాన్న మీరు సాధువా?" అడిగాడు గోపి.

"అలాంటిదే కాని, అది కాదు... ఇది స్వామి" ఆరిందాలా చెప్పింది గీత.

"భిక్షకి ఇంటింటికీ తిరుగుతారా నాన్నా?" మళ్ళీ గోపి అడిగాడు.

"ఒరేస్టుపిడ్.." అనేసి నాలుక్కొరుక్కొని 'స్వామియే శరణమయ్యప్ప... మణికంఠా మాట్లాడకూడదు..." నోటితో మాట్లాడి నొసటితో కోప్పడ్డాడు క్రిష్ణమూర్తి.

''యిస్సో...ష్...'' మాట్లాడని అక్కని తిరిగి మందలించాడు గోపి.

క్రిష్ణమూర్తి చేతి వాచీ చూసుకున్నాడు. సమయం మించి పోతున్నదేమో చికాగ్గా ముఖం పెట్టి ''మణికంఠుల్లారా మీ మాతని పిలుచుకురండి'' అన్నాడు.

''ఆ..'' అని అర్థం కానట్టు ముఖాలుపెట్టారు పిల్లలిద్దరూ.

''మీ అమ్మస్వామిని...'' అంటూ వివరణ ఇచ్చాడు క్రిష్ణమూర్తి.

''అమ్మకయినా మాకయినా మీరే కదా స్వామి....'' చేతులు జోడించి అన్నది గీత. గోపి మాత్రం 'అమ్మా...' అని ఇంట్లోకి కేకేసి అక్కడే నిలబడ్డాడు.

''వచ్చేసాను స్వామి...'' తడిచీరతో పూజసామానుల సంచీ పట్టుకువచ్చిన లలిత 'తలస్నానం చేసి వచ్చాను' అడక్కుండానే ఆలస్యానికి సంజాయిషీ ఇచ్చింది.

''ఏడ్చావ్ వెధవ ముఖం వేసుకొని...'' అని నాలుక్కరచుకొని 'స్వామియే శరణమయ్యప్ప... మా జోనల్మేనేజరు గాడొకడు నా ప్రాణం మీదికి. వీడితో మాలెయ్యడం తప్పయిపోయింది'' విసుక్కుంటూ గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు క్రిష్ణమూర్తి.

''అమ్మా... నాన్నకి స్వామి డ్యూటీ వేసారా ఆఫీసులో...?'' గోపి తల్లిచెంగుని గుంజి మరీ అడిగాడు.

''లేదు... లేదు నామీద కోపంతో మీ నాన్నే మాల వేసుకున్నారు...'' గోపికో మరెవరికో చెపుతున్నట్టో లేక తనలో తాను అనుకున్నట్టో చెప్పి ఇంట్లోకి నడిచింది లలిత. అర్థం కాని పిల్లలిద్దరూ ఆమె చెంగుపట్టుకుంటూ వెంట నడిచారు.

• • •

''లల్లీ మంచినీళ్ళు...'' అన్నాడు క్రిష్ణమూర్తి పేపరు చదువుకుంటూ. ఆయన ఒకే ఒక్క క్షణం ఆగి చూసాడు. మళ్ళీ -

''లలితా మంచినీళ్ళు...'' పిలిచాడు క్రిష్ణమూర్తి.

''ఆ...'' అంటూ అవతలిగొంతు వినిపించింది.

''అ...ఆ.... ఇ ఈ... అంటూ నిన్ను అక్షరాలు చదవమనలేదు. మంచినీళ్ళు తెమ్మన్నాను... నువ్వు 'ఓయ్' అంటూ తేవడముందా లేక...'' క్రిష్ణమూర్తికి ఒళ్ళుమండింది.

''అ. ఆ. ల్లో ఒ. ఓ. ఔలున్నాయి, ఎ.ఏ.ఐ లున్నాయి. ఇంకా...'' గీత పుస్తకాలు తిరగేస్తూ పక్కనే వున్న టాపిక్మధ్యలోకొచ్చింది.

''నువ్వు నోర్మూయ్యకపోతే 'క'కు యకారప్పొల్లు ఇస్తే 'కయ్'మంటావు'' అంటూ క్రిష్ణమూర్తి కోపంగా చూసాడు.

''అక్కకి కా గుణింతం రాదు నాన్నా...'' గోపిగాడు ఏం జరుగుతోందో తెలీకుండా ఏబీసీడీలు దిద్దుతూ తలెత్తి ఆఖరిమాటే విని ఆన్సర్ చేసాడు.

''మీ యమ్మ జీన్స్ వచ్చాయిరా మీకిద్దరికీ.. నేనొకటంటే మీరొకటి, కాదు ఒకటికి పది మాట్లాడుతున్నారు.. వంద మాట్లాడుతున్నారు...'' క్రిష్ణమూర్తిలో సహనం నశించిపోతోంది.

''ఓహో... ఒకట్లో పదులంటే వన్- టూ- త్రీ లే కదా...'' గోపీ గాడికి చదువు మైకం కమ్మేసి మళ్ళీ జవాబిచ్చాడు.

''నీకూ మీ అమ్మకీ ఐక్యూ ఎక్కువరా. అమాయకంగా ముఖం పెట్టి గొంతులు కోసేస్తారు.. నీళ్ళడిగి గంటయింది...'' ఇంకా ఎత్తుకొనేవాడే క్రిష్ణమూర్తి. కాని లలిత మంచినీళ్ళగ్లాను అతనిచేతిలో వుంచింది.

''ఏం మంచినీళ్ళడిగానా? మజ్జిగ పులుసడిగానా? తాళింపు పెట్టేసరికి లేటయిపోయిందండీ అంటూ చెప్పడానికి..'' క్రిష్ణమూర్తి లాగాడు దారాన్ని.

''రాత్రుళ్ళు మీకు అన్నం దిగదు కదా... చపాతీ కోసం పిండి పిసుకుతున్నాను...'' లలిత పిండితడి అంటిన చేతుల్ని అతని ముందరే దులిపింది.

''క్రమశిక్షణ అంటే తెలుసా, డిసిప్లిన్.. అంటే తెలుసా...'' క్రిష్ణమూర్తి ఏదో తడుముకున్నాడు.

''సైలెన్స్ ప్లీజ్ - కద నాన్నా...'' గోపీగాడి కాన్వెంటు విజ్ఞానం కుదురుగానే కాదు నోరుకట్టి వుంచలేకపోయింది.

''ఆడపిల్లని దాన్ని 'బడి'లో వేసి, మగపిల్లవాడివని నిన్ను కాన్వెంటులో వేసాను చూడూ... అదీనా తప్పు... బుద్ధి తక్కువ'' అని తనచెంపలు తానేవాయించుకొని ''అయినా ఇవన్నీ మీయమ్మే కదా నేర్పిస్తోంది'' క్రిష్ణమూర్తి కళ్ళు లలిత మీదకు తిరిగాయి.

''గొంతెండి పోగల్దు తాగండి'' అంది లలిత.

''...అంటేనేనేదో వాగుతున్నానని... నా గొంతెండిపోతోందని... అరిచరిచి నేనిలాగే ఛస్తానని... అదేగా... అంతేగదా నీ ఉద్దేశం...'' దారాన్ని ఎటుకటు లాగాడు క్రిష్ణమూర్తి.

''మీయిష్టం... ఏమన్నా అనుకోండి.. నాకుతల పనుంది. పిండి పిసికి రాత్రికి రొట్టెలుమర్చాలి...'' వెళ్ళిపోబోయింది లలిత.

క్రిష్ణమూర్తి ఆమె చెయ్యి పట్టుకున్నాడు. ''అంత నిర్లక్ష్యమేమిటి?... అంటే./. న్నిలాగో చావమనే కదా నీ ఉద్దేశం? 'రొట్టెలమర్చాలి' నీ ఎత్తిపొడుపు నాకర్థం కాలేదనుకోకు. కష్టపడేవాణ్ణినేను. సంపాదించేవాణ్ణినేను. అమిర్చిపెట్టడానికి నీకేమయిందే? నీ బాబుగారింటి నుండితెచ్చిపెడుతున్నావా?...'' క్రిష్ణమూర్తి దారాన్ని లాగడంతో గ్లాసు నీళ్ళు ఒలికి బట్టలమీద వంటిమీద పడ్డాయి.

''మా బాబు నన్నిచ్చాడుగా చాకిరీ చెయ్యమని... ఇంకేమిస్తాడు...'' లలిత కూడా అందుకోక తప్పదన్నట్టు దారాన్ని అందుకుంది.

"....గ్లాసు నిండా నీళ్ళు ఇస్తావా? కొద్దిగవెలితయితే తక్కువయితే చాలకచచ్చిపోతానా? చేసే పనిలోనే తెలుస్తుంది నీ వాలకం.. పైగా చాకిరీ అంటావా? నీ కుటుంబం కింద నువ్వు చెయ్యడానికి చాకిరీ అంటావా?..." దారాన్ని లాగుతూనే వున్నాడు క్రిష్ణమూర్తి.

"లేదు... ఇది చాకిరీ కాదు... సింహాసనం మీద కూర్చోబెట్టి చూసుకుంటున్నావా? మరా? పట్టపురాణీని. పదిమంది పనివారు.... అలవాటయిపోయింది, ఇప్పుడు ఒళ్ళు వంచలేకపోతున్నాను" లలిత మంట ఎక్కువై దారాన్ని మరింత లాగింది.

పిల్లలిద్దరూ తండ్రిచెప్పిన డిసిప్లిన్ పాటిస్తున్నట్టు మౌనంగా వుండి, కనీసం కన్నయినా ఆర్పకుండా తగువు చూస్తున్నారు,

"...అంటే... నిన్ను పట్టపురాణీ లాగా చూడ్డం లేదనే కదా... నాకు చాతకావడం లేదనేగా... నీకూ.. మా ఆఫీసు లంజకొడుకులకీ- సంపాదన తక్కువనే కదా లోకువయిపోయాను... మీయమ్మ..." బూతులందుకున్నాడు.

ముడిపడింది దారం. మామూలుగా కాదు... చిక్కుముడి.. ఎటులాగినా మరో ముడిపడిపోతోంది. ఎటూ కదల్లేక లలిత నిలబడింది. క్రిష్ణమూర్తి ఆమె మీద పడి "నన్ను చంపీ... చంపీ.. రా. పాలసీలూ ఇన్సూరెన్సులూ ఫుల్ఎమౌంట్ వస్తుంది. నా ఉద్యోగమూ వస్తుంది. రాణీయిపోదువు నిజంగానే.. చంపీ..." అంటూ లలితచేతులు తీసి తనమెడమీద వేసుకొని నొక్కుకున్నాడు. ఆమె చేతిగోరు తగిలి అతని భుజం మీద చర్మపుపొర రేగి రక్తం చెమటలా పట్టింది.

"నా రక్తం కళ్ళజూస్తావా లక్ష్మీ..." అంటూ దుబుదు దబుదుమని లలితను బాదేసాడు క్రిష్ణమూర్తి. చిక్కాడు. బక్కిరాడు. ఆ సమయంలో అతనికి అరుస్తున్న పిల్లలు గాని అడ్డం వచ్చినవాళ్ళ శరీరాలు గానీ కనిపించలేదు. అతనికి చిన్నప్పటి 'బిళ్ళాదండి' ఆటలో తనని బాదేసిన బంటిగాడు గుర్తొచ్చాడు. అందంగా నవ్వి ఆప్యాయంగా పలుకరించి వెనకాతలే 'వేలే' ఆఫీసులంజకొడుకులు గుర్తొచ్చారు.

కొద్దిసేపటికి అలసిపోయి నిల్చున్నాడు క్రిష్ణమూర్తి. లలిత చీమకుట్టినట్టయినా స్పందించలేదు. కదల్లేదు. అలాగే నిలబడివుంది. పిల్లలిద్దరూ ఏడ్చేవాళ్ళే గాని తల్లిని చూసి - ఆమె ఏమీకానట్టు వుండడం చూసి- వాళ్ళూ వింతగా చూస్తున్నారు.

క్రిష్ణమూర్తి భుజం మీద రక్కుని తడుముకొని వేలితో రక్తాన్ని వూర్చి..."పుట్టినప్పటినుంచి చిన్నదెబ్బ కాదు, ఒక్క మీటకాయ కాసి ఎరగను... అలాంటిది నువ్వు నా రక్తం కళ్ళజూస్తావా? నా బంగారుబాల్యం ఏమయిపోయింది ? నా కలర్ఫుల్ బేచులర్ లైఫ్ ఏమయిపోయింది? ఆ జీవితం మళ్ళీ రాదా? మరి మరి రాదా?" తలపట్టుకు కూలబడిపోయాడు.

పిల్లలకి సినిమా చూస్తున్నట్టు వుంది.

లలితకు చోద్యం చూస్తున్నట్లు వుంది.

'' మా వూరి బురదచెరువులోనే ఈదడం రాదు నాకు. అలాంటిది సంసారం వట్టిచెరువు కూడా కాదు, సాగరం... సముద్రం... ఈత కూడా రాని నేను సముద్రంలో దూకెయ్యడమేమిటి?'' దుఖం పట్టలేక క్రిష్ణమూర్తి కంట తడిపెట్టుకున్నాడు. ముక్కు చీముడు వల్చగా తేటనీరులా కారింది. లలిత అనుకోకుండానో అలవాటుగానో టవల్ అందించింది. శుభ్రంగా తుడుచుకొని కళ్ళు మరోసారి ఒత్తుకొని జేబులోని దువ్వెనతీసి తలదువ్వుకున్నాడు. గోడకున్న అద్దంలోకి తొంగిచూసాడు. పౌడరు జోరికలు కనపడకుండా అద్దుకున్నాడు.

''సాధుల్లో కలిసేంతధైర్యం లేదు'' క్రిష్ణమూర్తే అన్నాడు దువ్వెన జేబులో పెట్టుకొని, కర్చీప్ మడతపెడుతూ.

లలిత, పిల్లలు కాళ్ళకు మేకులు కొట్టినట్టు నిల్చున్నారు.

''కనీసం స్వాముల్లోనయినా కలిసిపోవాలి'' వినబడేటట్టే అనుకుంటూ వీధిలోకి నడిచాడు క్రిష్ణమూర్తి.

* * *

''ఏమయ్యా క్రిష్ణమూర్తి ఈ మధ్య బొత్తిగా నల్లపూసయిపోతున్నావ్?... ఎక్కడా దర్శనాల్లేవ్?'' ఆఫీసు సూపరెండెంట్ పద్మనాభశాస్త్రి నవ్వుతూ అడిగాడు. దూదితో దారం పేమడం మొదలుపెట్టారు.

''అదేంటి సార్ నేను రెగ్యులర్‌గా డ్యూటీకి వస్తున్నాను. ఈ రెణ్ణెళ్ళలో ఆఫ్‌డే సియ్యల్లయినా పెట్టలేదు. గంట పెర్మిషనయినా తీసుకోలేదు...'' అనుమానంగానే అణుకువ ప్రదర్శిస్తూ అడిగాడు క్రిష్ణమూర్తి.

పద్మనాభశాస్త్రి గారు పడి పడి నవ్వారు.

క్రిష్ణమూర్తి చేతులు కట్టుకొని నిల్చున్నాడు.

''కూర్చో... కూర్చో...'' అంటూ కుర్చీ చూపించారు శాస్త్రి గారు. క్రిష్ణమూర్తి ముడ్డికి తులిసిర్లయినట్టు కుర్చీ అంటీ అంటకుండా కూర్చున్నాడు.

''రావుగోపాలరావుగారేమన్నారు?'' ప్రశ్నించేరు శాస్త్రి గారు.

''కొత్తగా కదా ఓపినింగు అయింది షాపు, అందకా మెటీరియల్ మీద ట్వల్వ్ పెర్సంటు తీసుకొమ్మన్నార్సర్. పండగకపోయాక ఫిఫ్టీన్ పెర్సంటు చేస్తామన్నాడు'' అన్నాడు క్రిష్ణమూర్తి.

''గవర్నమెంటుకీ ఈడికీ తేడాలేదయ్యా ఏడాదికో ఇంక్రిమెంటు కలిపినట్టుగ ఇస్తాడా? రివైజ్డు పేస్కేలుసూత్రం ఆయనకీ వర్తిస్తుందని చెప్పు... మనం మన గవర్నమెంటుకంటే ఎక్కువగానే చూసుకుంటున్నాం...'' శాస్త్రిగారు బాయ్ తెచ్చిన

కిల్లీని అమాంతం నోరుతెరచి అంగుట్లో పిప్పరమెంటు బిల్ల వేసుకున్నట్టు వేసుకున్నారు.

''అలాగే సార్... యస్సార్...'' క్రిష్ణమూర్తి తలాడించాడు.

''...ప్చ్... నువ్వసలు విష్యం డెవర్టు చేస్తావయ్యా క్రిష్ణమూర్తీ... నేను రావుగోపాల్రావ్ అన్నది సినిమాయ్యాక్టరు రావుగోపాల్రావుని గురించి...'' ఇంకా చెప్పేవారే కిల్లీ నమలడానికి ఆగారు శాస్త్రిగారు.

''ఆయనా?, ఆయనేమన్నారు సార్?'' చాలా ఉత్సుకతనీ ఆసక్తినీ కలగలిపి అడిగాడు క్రిష్ణమూర్తి.

''వట్టినే తిని తొంగుంటే.. మనిషికీ గొడ్డుకీ తేడా యేటుంటది?'' అని కిల్లీ వుమ్మిని డస్ట్‌బిన్‌లో కదలకుండానే తుపుక్కున వుమ్మారు. ఆ కొద్దిక్షణాల్ని క్రిష్ణమూర్తి వదులుకోదల్చుకోనట్టు ''తిండంటే మీకు తెలియందేముంది సార్.. ప్రైవేటుపార్టీలూ తెలివి నేర్చారు. అందువల్ల తగ్గిపోయింది. ఇక తొంగోడమంటే లంచవర్లో తిన్నాక ఒక్కగంటే... తిన్నాక నడుం చేరేస్తే మంచిదని డాక్టరు సలహాల్లో చదివాను'' చెప్పుకుపోబోయాడు.

''అబ్బా క్రిష్ణమూర్తీ.. కొత్తవాళ్ళకిచెప్పినట్టు చెప్పినట్టు చెప్పకు.... మేము పాతబైల్లర్లమే గదా.. ఇంతకీ పూర్తికానిచ్చావు కాదు. ఆ... మనకి తిని తొంగోడం తప్ప మరో యాపకమూ యాతనా లేదు. ఉద్యోగం పనులూ సంసారం సాధకబాధకాలు ఎప్పుడూ వుండేవే. అంచేత కాస్తంత కళాపోషణుండాలి. మనం మనల్నే పోషించుకోలేం. కళనేం పోషిస్తాం... అందుకు మనమే... కళాకారులం కావాలి... అన్నట్టు నీకు తెలుసా? వద్దులే.. నువ్వు విషయాన్ని డైవర్టు చేస్తావ్. కళలు అరవైనాలుగు. అందులో భక్తి కూడా ఒక కళ! ఈ కళ ద్వారా ముక్తీ మోక్షం రెండు లాభిస్తాయి...'' సుదీర్ఘ ఉపన్యాసంలో శాస్త్రిగారు ఉమ్మిగుటకలు మింగారు. దారం పేమడం ఆగలేదు.

''భక్తి కళా...?'' అనుమానంతో గాక ఒక కొత్త విషయాన్ని తెలుసుకుంటున్నట్టు చూసాడు క్రిష్ణమూర్తి.

''అవును మూర్తీ రః కలికాలంలో దైవభక్తి తరిగిపోతున్నది. అంచేత భక్తి ఒక కళగా ప్రదర్శించగలిగితే ఆకట్టుకోగలిగితే దేశప్రజలందర్నీ భక్తుల్ని చేయవచ్చు... తర్ఫీదు ఈయవచ్చు...'' జ్ఞానప్రసాదం పంచారు శాస్త్రిగారు.

''చిత్తం...'' దేవుడి ఎదుటే వున్నట్టు చేతులు జోడించాడు క్రిష్ణమూర్తి.

''మీ దైవం ఎవరు? అదే ఇలవేల్పు...'' అడిగారు శాస్త్రిగారు.

క్రిష్ణమూర్తి కొద్దిగ సంకోచిస్తూ ''మరిడి... అమ్మతల్లి.... మరిడమ్మ తల్లి...'' చెప్పాడు.

''మన పూర్వీకులకి మూఢనమ్మకాలెక్కువ, అంచేతనే ఈ మరిడమ్మలూ అంకాళమ్మలున్నా. అప్పరే...ఇరవై ఒకటో సంవత్సరం దాటి ఏకంగా '2020' లోకి వచ్చేస్తున్న ఈ రోజుల్లో ఆ పేర్లే ఎవరికీ తెలియవయ్యా.. కల్చరుండాలయ్యా, కల్చరు... సరే... ఒకటి చెప్పు... ఈ సినిమా వాళ్ళూ ఇంకా పెద్దపెద్ద వ్యాపారాలు చేసేవాళ్ళు రాజకీయనాయకులు అందరూ నమ్మేది బాబాగార్నే... కోట్లకు పడగలెత్తినపెద్దవాళ్ళని చూసి చిన్నవాళ్ళం నేర్చుకోవాలయ్యా...'' కిల్లీ అంత అయిపోయింది. శాస్త్రిగారు పెదవులు తుడుచుకోవడానికి ఆగారు. దారం పురెక్కింది.

''అవున్సార్... మొన్నే రాష్ట్రముఖ్యమంత్రి, దేశప్రధాని కూడా సత్యసాయిబాబా గారి కాళ్ళమీద పడి ఆశీర్వాదాలు అందుకున్నారు...'' క్రిష్ణమూర్తి అందించబోయాడు.

''పెద్దవాళ్ళు... వాళ్ళ రాజకీయం మనకి అర్థం కాదుగాని సత్యసాయిబాబాని దొంగంటారోయ్... అలాక్కాకపోతే ఆమధ్య హత్యలెందుకు జరిగాయి?'' శాస్త్రిగారి మాటకు క్రిష్ణమూర్తి అవాక్కయిపోతూనే 'అవునవును' అన్నాడు మళ్ళీ.

''షిరిడి సాయిబాబాని నమ్ముకో...ఏడాది తిరిగేసరికి నీ క్లర్కుపోస్టుకి రిజైన్ చేసెయ్యవూ?'' నమ్మకంగా అన్నారు శాస్త్రి.

''అంటే నా ఉద్యోగం...'' అనుమానొచ్చింది క్రిష్ణమూర్తికి.

''ఇంతకంటే మంచి ఉద్యోగంలో చేరుతావన్నమాట... లక్ష్మివారం పూట రా.. గుళ్ళో కలుద్దాం... ఇక వెళ్ళు...'' ఫోన్ రావడంతో అప్పటికి వదిలారు సూపరిండెంట్ శాస్త్రిగారు. దారాన్ని కట్టి మరీ వదిలారు.

''అలాగేసార్... తప్పకుండా సార్... నమస్కారం సార్...'' మరోసారి నమస్కారం పెట్టి ఆ గదిలోంచి బయటకువచ్చి అలసిపోయినట్టు పెద్దఊపిరి తీసుకున్నాడు క్రిష్ణమూర్తి. ఆ ఆయాసం తీరకముందే మేనేజరు వర్మగారు క్రిష్ణమూర్తి భుజం మీద చెయ్యి వేసారు. క్రిష్ణమూర్తి గుక్కురుమని, పొద్దున్న డ్యూటీకి వస్తూనే నమస్కారం పెట్టినా - మళ్ళీ 'గుడ్ మార్నింగ్ సార్' అన్నాడు.

''బాగా అలసిపోయినట్టున్నావ్.. లోపల బాగా వాయించేసాడా?... నిన్ను కూడా షిరిడీవెళిపోదాం వచ్చేమన్నాడా? అంటాడు.. అమాయకుడివి... నువ్వు దొరికిపోయావ్..'' అని క్రిష్ణమూర్తి నుదిటిమీది చెమటని అతని గుమాలుతోనే అద్ది ''టీ తాగుదాం పదా, రిలాక్స్ అవుదూ గాని'' భుజం మీద చెయ్యి తియ్యకుండానే కేంటీన్‌వేపు నడిపించాడు వర్మ.

భుజం పీకిందే గాని బుర్ర పన్జెయ్యడం మానేసినట్టుగుంది క్రిష్ణమూర్తికి. డిప్యూటీ మేనేజరు గారి ఫ్రెండ్ మరీ అర్థం కాకుండా వుంది. కల కాదు కదా' అనుకున్నాడు. ప్రమోషను గురించి మనసు పరిపరివిధాలా పోతోంది. అయితే వేడి టీ చప్పరించేసరికి నాలుక కాలిపోయి దద్దుర్లెక్కి కల కాదని తెలుసుకున్నాడు.

''నీకు పీజీ డిగ్రీ కూడా వుంది. భగవాన్ వీక్షణాలు లేక మేనేజరు కావలసిన వాడివి ఇలా వుండిపోయావ్..ప్చ్...'' మేనేజరు వర్మగారు దరం ప్రేమడం మొదలుపెట్టారు. దాంతో క్రిష్ణమూర్తి - పెళ్ళయిన మొదట్లో ప్రేమతో అనురాగంతో ఆర్తితో ఇంకా అనేకవాటితో లలిత వంక చూసినట్టు ఇంతకాలం తర్వాత మళ్ళీ ఇప్పుడలా వర్మగారివేపు చూసాడు.

''మన కృషితో పాటు భగవాన్ కూడా ఓ చెయ్యి వెయ్యాలోయ్... దాన్నే పెద్దలు కలిసిరావడం'' అంటారు అన్నారు వర్మగారు.

క్రిష్ణమూర్తికి గుండె వేగంగా కొట్టుకుంది. నాలుకా కొట్టుకుంది. టీ కప్పు ఖాళీ అయింది.

''కలిసి రావలి అంటే కలిసి వెళ్ళాలి..'' వర్మగారి మాట పూర్తి కాలేదు.

''ఎక్కడికి?'' అడిగాడు క్రిష్ణమూర్తి.

''ప్రేమ గొప్పదోయ్!...ఈ ప్రేమ భార్యాభర్తల మధ్య వుండే అమరాల ప్రేమ కాదు. బిడ్డలమీద వుండే మమకారపు ప్రేమ కాదు. మేనేజర్లపై వుండే గౌరవాభిమానల ప్రేమ కాదు. ప్రేమంటే భగవాన్ సత్యసాయికీ మనకీ మధ్య వుండేది ప్రేమ...ఈ ప్రేమకు మరణం లేదు. ఈ ప్రేమ సర్వీసుని సేవల్ని అందిస్తుంది'' వర్మగారు చెప్పారు. దరం వురెక్కింది.

''అవునవును సార్...'' క్రిష్ణమూర్తి కళ్ళలో జ్ఞానదాహం.

''సత్యసాయిబాబా గారు ఎంత సర్వీసుని అందిస్తున్నారు. ఊరు ఊరు వాడ వాడా మన ఆర్గనైజేషన్స్... ఒక్క మన రాష్ట్రం దేశం మాత్రమే కాదు ప్రపంచవ్యాప్తంగా భక్తులున్నారు. మన కళ్ళముందే భగవాన్ వున్నా మనం గుడ్డివాళ్ళమయిపోతున్నాం. దేవుడు ఎక్కడో వుండడు. మనుషుల్లోనే వుంటాడు. మనిషే దేవుడు... అందువల్ల నీకు నా సర్వీసు అందిస్తాను... కనీసం జూనియర్ మేనేజర్ని చేస్తాను...'' వర్మగారు నమ్మకంగా చెప్పారు.

''తప్పకుండా సార్.. మీ సేవాదళ్‌లో కలుస్తాను. నిజమే సార్ 'సర్వీసు' గొప్పది... ఆ షిరిడీసాయి వున్నదే పంచాడు, అంతే. ఈ సత్యసాయి అందరిదీ పంచుతున్నాడు...'' క్రిష్ణమూర్తి ఎల్లర్ట్ అయిపోయాడు. ఉత్సాహం కొద్దీ.. ''శాస్త్రిగారు చాలా ఘోరంగా మాట్లాడారు సార్.. సాయిబాబా దేవుడైతే ఆ కాల్పులప్పుడు బెల్ మోగగానే తలుపుచాటున ఎందుకు దాక్కున్నారు. పూనాలోనో ఎక్కడో బంగారం గొలుసు తీసి ఇచ్చినప్పుడు ఎవరో వెనకనుండి అదించడం పేపర్‌లో వేసినా సిగ్గులేదు... ఆ ఫిలిం కాల్పించేసాడట.. ఇంకా ఏదేదో అన్నాడు సార్ ఆ శాస్త్రి.... ఆ..ఏమిటి బాబా మంచోడు? అల తమ్ముడే దొంగని చెప్తారు కదా... అలాంటాయన్ని ఎందుకు తనతో వుంచుకోవడం. అసలు నాస్తికులైనా అలా మాట్లాడరు.. అంత దారుణంగా దుర్మార్గంగా మాట్లాడాడు సార్... వాడు ఒట్టినే చావడం సార్... పురుగులు పట్టి చస్తాడు...'' క్రిష్ణమూర్తి తలబరువు తీరింది. వర్మగారు తెప్పించిన రెండో టీ తాగి ఆగాడు. దరం టెన్షన్‌గా తయారయింది.

డిప్యూటీ మేనేజరు వర్మగారికి కొద్దిసేపు మాట రాకపోయినా - క్రిష్ణమూర్తిని కళ్ళతోనే అభినందించి ''ఈ గురువారం బాబా గుడికి రా...'' అని లేచి వెళ్ళిపోయారు. క్రిష్ణమూర్తి ''మంచిది'', అన్నమాట గాని నమస్కారం గాని అందుకోకుండా వెళ్ళిపోయారు వర్మగారు.

క్రిష్ణమూర్తి కళ్ళుమూసుకొని నొసలు పాముకున్నాడు.

మళ్ళీ భుజం మీద చెయ్యిపడింది. చూస్తే కొలీగ్ గోవర్ధనరావు. '' ఏం.. బ్రదరూ థర్స్‌డేకి- గురువారం, లక్ష్మీవారం అని రెండు పేర్లున్నా అవి వారానికి రెండురోజులు కావు, ఒక రోజే... ఏ రోజెక్కడికెళతావో...'' అన్నాడు మరో రెండు టీలకు ఆర్డరిస్తూ.

క్రిష్ణమూర్తికి నిజంగానే జవాబు దొరకలేదు.

'' ఆయన షిర్డీసాయి అంటాడు. ఈయన సత్యసాయి అటాడు. రెండూ నుయ్యిలే. అందుకే నేను గొయ్యి చూసుకున్నాను. నేను మెహర్‌బాబాని నమ్ముతున్నాను'' అని చెప్పి- టీ తాగి - మరోసారి క్రిష్ణమూర్తి భుజం తట్టి దారప్పోగు వదిలి వెళ్ళిపోయాడు గోవర్ధనరావు.

కేంటిన్ శెట్టిగారే ఈ దఫా క్రిష్ణమూర్తి దగ్గరకు వచ్చారు. ఆర్డరివ్వకుండానే ప్రొప్రయిటరని రెండు టీలు తెచ్చి పెట్టాడు సర్వరు.

''అయ్యా క్రిష్ణమూర్తీ, నేను వియ్యారెస్ తీసుకొని కేంటిన్‌పెట్టుకున్నంత మాత్రాన నీ కొలీగుని కాకపోను. చిన్నవాడివి చెపుతున్నాను విను. బెదిరిపోకు సుమా. మనం ఖాళీగా వున్నంత కాలం... ఖాళీగానే వున్నామని తెలిసినంత కాలం - భక్తులు ఎవరి ప్రయత్నాలు వాళ్ళు చేస్తారు...'' టీ మింగడం కోసం ఆగారు శెట్టి గారు. దారం పేమడం ప్రారంభమయింది.

''నేను ఖాళీగా వుండడమేమిటండీ?'' క్రిష్ణమూర్తికి అయోమయం పోలేదు.

''... అదేనయ్యా.. నీ భక్తిని ఏదో ఒక ఖాతాలో జమ చెయ్యకుండా ఖాళీగా వున్నావని అర్థం. అది తెలిసి అనేక బ్యాంకులవాళ్ళు వస్తారు. మా దగ్గర డిపాజిట్‌చెయ్యండంటే మా దగ్గరచెయ్యండని.... మనం నమ్మకమైన బ్యాంకులో వేసుకోవాలి. డిపాజిట్‌సొమ్ము ఆఖర్న ఎలాగూ వస్తుంది. మధ్యమధ్యలో కనీసం 'వడ్డీ' వస్తుండాలి. లాభుడాలి. మనసొమ్ము సొమ్ముగానే వుంటుంది. మన అవసరాలు వడ్డీతో తీరుతాయి, అంటే ఆర్గనైజు అయ్యాక వుండే బెనిఫిట్స్ అన్నమాట. ఉదాహరణకు నేనున్నాను. నేనేమిటో నీకు తెలును. మావాళ్ళందరూ కల్కి భక్తులు. ఆమాటకొస్తే కల్కి కూడా మావాడే. అందుకే నేనక్కడ చేరింది. మా పిల్లలకి పెళ్ళిసంబంధాలు, ఉద్యోగబంధాలు అన్నిటికీ ఇది ఉపకరిస్తుంది... నీ పిల్లలు చిన్నవాళ్ళు నీకిప్పుడు తెలియదు. రేపటిగురించి ఆలోచించు. ఆలోచిస్తే నువ్వు ఖాళీగా వుండవు. నిన్నెవడు ఖంగాళీ చెయ్యడు'' కౌంటర్ దగ్గర మనుషులు ఆగిపోయారని ఆపలేక ఆపలేక తన స్పీచి ఆపి వెళ్ళాడు శెట్టి. దారం బాగా పేముకుంది.

క్రిష్ణమూర్తికయితే శెట్టిగారినే తన భగవంతుడుగా ఎంచుకోవాలనిపించింది. పాదాభివందనం చేయాలనిపించింది. ఎన్నడూ తెలుసుకోనంత జ్ఞానం ఒకేసారి

తెలుసుకున్నట్టు హృదయం భారమయింది. లలిత ఇవన్నీ ఎప్పుడు తెలుసుకుంటుందోననిపించింది. ఈ పిల్లలకు రాలుగాయితనం తప్ప లోకం తెలీదు... ప్చ్... నిట్టూర్చాడు. అలాగే అడుగులు వేస్తూ కేంటిన్ దాటాడు.

కోన్‌కిస్కాగాడెదురయ్యాడు. క్రిష్ణమూర్తి ఆవలించాడు. వాడు పేగులు లెక్కపెట్టి - ''పిచ్చోడా.. బగవంతుడు అంతటా నిండివున్నాడు. మా అయ్య గైనం ఇచ్చాడు. నన్నూ, ఆస్తిగా తీసుకోరా అని. దాన్ని ఏం సేద్దుమా అని మా పెరటి సెట్టు తొర్రలో పెట్నాను. మా ఆవిడ పిల్లలేడుస్తుంచే ఆడించడానికని ఆ గైనానికి కాటుకా కుంకమబొట్టూ పెట్టి మర్సిపోయింది. తెల్లారి తలుపు తీస్తే జనం ఒక పొసరు. ఆకాసం ఈనీసినట్టే బూమి వట్టనిజనం... లైను కట్టేసినారు ప్రజ... పళ్ళూ ఫలరాలు దచ్చిన.. ఎవులికెంత కలిగితె అంత. అదప్పుడు మాట. ఇప్పుడో రెండ్రూపాయలు టిక్కటు పెట్టేస్నాను. పెసలుపూజలూ ఆటిరేట్లూ మా ఆవిడనూనుకుంతాది. ఇద్దరు పూజార్లు. సిప్టుల పెకారమే టైమింగు డూటీ జనం కోతి యెదవలు కదా ఒక తిన్నగుండరనీసి ఒక ఓమ్‌గార్డుని పెట్నాను. ఇవన్నీ గాక పనుల సాయంకి ఆటికీ ఓ ఆడమనిషిని పెట్నాను. ఈల ఓలు మొత్తం జీతాల్నాతాలూ నానే నూసీది. తీర్దం లేదు. అందుకేనా ఉజ్జోగాన్ని ఉఫ్‌మని ఊదేస్ను... ఎప్పుడయినా రా నూద్దువు. ఉప్పుడు టైం లేదు. ఎప్పుడయినా వొస్తే ఒక ఫోను కొట్టిరా...పొన్నెంబరు రాస్కో... '' చెపుతూనేవున్నా - కోన్‌కిస్కాగాడి మాటలు అర్థమయినా జడ్డివెధవలా నిలబడ్డాడు క్రిష్ణమూర్తి.

''ఏటలాగ నూస్తావ్...ఏ దేవుడనా?'' అని నవ్వి ''మొదట్రోజు జనం నూసి మాయావిడ తబ్బిబ్బైపోయి ఆల ముసిలమ్మది, ఆలమ్మది గైనమిప్పేసి, ఆలు బతికున్నారు, నువ్వు కంగారుపడకు. ఆ రెండు గైనాల్ని సింతపండుతోటి తోమి బొట్లుపెట్టి సిన్న గుడ్డపీలిక ఒకదానికిసుట్టి- ఈ రెండు గైనాలు ఆ గూటిల పెట్టింది. మొత్తం ఎన్నయినాయి. మూడేగదా... సీతారాముల వారు పక్కనే లచ్చున్న సావి... అనీసి మనకిసెవ అక్కర్లేదు జనవే...పేరు పెట్టేసినారు. మా గుంటడు ఒకరవ్వ తెలివైనోడులే... సైకిలు బాలున...ఏటి బేరింగుల వుంతాది కదా గుండ్రగ.. ఆ అరిగిపోయిన కిలుంపట్టిన బాలుసా తెచ్చి ముస్తాబు సేసి, తీగి తోకపెట్టి 'ఆంజినేయుడ్రా అయ్యా' అని ఆడు నాతోటి ఇంకాఅన్నాడో లేడో లోకం మొత్తం అదే మాటంది. ఆలమాటని మనవేల కొట్టాల...'' అని కోన్‌కిస్కాగాడు గుండిరిసి నవ్వి - అంతలోనే చిన్నగా అన్నాడు. ''అంతా బాగుంది గాని ఆజాగాని నూపించి ఏ లంజికొడుకులైనా ఇదే అయోధ్య అంతే.... వున్న గుడిసె పోద్ది అని గుండె కొట్టుకుంటాది బాబూ... అంతకుమించి జడుపులేదు..''

క్రిష్ణమూర్తికి రామాయణం చూస్తున్నట్టయింది.

కోన్‌కిస్కాగాడు వాచీ చూసుకొని, ఏదో గుర్తుకువచ్చినట్టు వెనక్కి తిరిగి పరిగెత్తాడు.

''గుడ్‌మార్నింగ్ సర్... నమస్తే సర్..'' క్రిష్ణమూర్తి చేతులు గుండెకానించి నమస్కరించేడు.

''నో.. సర్.. స్వామి...స్వామి...'' జోనల్‌మేనేజర్‌నటరాజు గారు ప్రతినమస్కారం చెయ్యకుండానే అన్నారు.

''యస్సార్... స్వామి... స్వామి'' నేర్చేసుకున్నట్టు అన్నాడు క్రిష్ణమూర్తి.

''కొత్తలో నాకూ అంతే స్వామీ... మా ఆవిడ్ని స్వామి అని పిలవాలంటే సిగ్గుగా వుండేది. ఆ తర్వాత అలవాటయిపోతుంది. నేను ఏడాది ఏడాది మాలవేస్తున్నాన. నేను అందర్నీ అన్నివేళలా మాల వేసినపుడూ తీసినపుడూ స్వామనేపిలుస్తాను...'' నటరాజుగారు చెపుతూనే వున్నారు.

క్రిష్ణమూర్తి తనవంక చూసుకున్నాడు. నల్లని దుస్తులు... మెడలో వేలాడుతున్న రుద్రాక్షమాల...పాదాలవంకచూసుకున్నాడు. చెప్పుల్లేవు... ఎదురుగా గోడకు వున్న అద్దంలో ముఖం చూసుకున్నాడు. దువ్వని కారణంగా చింపిరిజుత్తు... నుదిటిమీద బొట్టు... రెండు దండల మీద.. పొట్ట మీద.. వీబూదిరేఖలు...ఒక గొప్ప భక్తుణ్ని చూసిన అనుభూతి కలిగింది. కళ్ళు చెమర్చాయి... అంతలోనే గొప్ప భక్తుడైపోయిన అనుభూతి కలిగింది. కళ్ళలో నీటి ఆవిరులు....

కొద్దిసేపటికి క్రిష్ణమూర్తి కళ్ళు తుడుచుకొని ఇటూ అటూ చూసాడు. షిర్డిసాయి లేడు. సత్యసాయి లేడు. శాస్త్రి లేడు. వర్మ లేడు. వున్నదల్లే తనలానే వున్న అయ్యప్ప భక్తులు. వెనక్కి తిరిగిచూసాడు. మెహర్‌బాబా లేడు. గోవర్ధనరావూ లేడు. వున్నదల్లా అయ్యప్ప భక్తులే. ఆఫీసు పెద్ద దేవాలయంలా తోచింది. ఆ తీయనితలపు ఎంతో ఆనందాన్నిచ్చింది. అది పంచుకోవడానికన్నట్టు క్రిష్ణమూర్తి సూపరిండెంట్ శాస్త్రి, మేనేజర్ వర్మ వంక చూసాడు. వాళ్ళ ముఖాలు చూస్తే ఎందుకో నవ్వొచ్చింది. ఆ నవ్వుని అదుపులో పెట్టుకోవడం కష్టమయింది....

ఇంతలో ఫోన్ మోగి క్రిష్ణమూర్తి రక్షించబడ్డాడు.

జోనల్ మేనేజర్ నటరాజ్ గారు ఫోన్ మాట్లాడాక - ''కలెక్టరు స్వామి గార్నుంచి ఫోను... మన వర్క్స్ అలాట్‌మెంట్ విషయం మాట్లాడి వస్తాను. మధ్యాహ్నం ఒక్కపూటే గదా... భోజనం బిక్ష.. రెడీచెయ్యండి..'' అంటూ సీట్లోంచి లేచారు. ఆయన వెనకాలా అంతమందీ నడిచారు. ఆయన కారెక్కగానే అంతా తిరిగి ఆఫీసులోకొచ్చారు.

అంతవరకూ అదిమిపట్టిన నవ్వుని ''కికిక్...హిహిహ్హి... అహహ్హ...'' నెమ్మదిగా మొదలుపెట్టి పెద్దపెట్టున నవ్వాడు క్రిష్ణమూర్తి.

అర్ధంకాని వాళ్ళంతా వింతగా చూస్తే - శాస్త్రి గారూ వర్మగారూ మాత్రం ముఖాలు మాడ్చుకొని ధుమధుమలాడారు. ఆ తర్వాత వాళ్ళ వాళ్ళ గదుల్లోకి వెళ్ళిపోయారు.

ఎవరిసీట్లలో వాళ్ళు పనులు చేసుకుంటున్నా - క్రిష్ణమూర్తి పనిచేసుకుంటూనే తలచుకొని మరీ నవ్వుతున్నాడు.

ఆఫీసుబోయి సూపరింటెండెంట్ గారు పిలుస్తున్నారని క్రిష్ణమూర్తికి వచ్చి చెప్పాడు. క్రిష్ణమూర్తి సూపరింటెండెంట్ గదిలోకి వెళ్ళేసరికి అక్కడే మేనేజర్ కూర్చొని వున్నాడు. క్రిష్ణమూర్తి ఉలిక్కిపడి వినయంగా నిలబడ్డాడు.

''ఎందుకానవ్వు... మా విశ్వాసాలు మావి. మా నమ్మకాలు మావి. ఏవి ఎవరివయినా ఎవరివి వారివే. విజయవాడ నుండి శ్రీకాకుళం దాక జోన్‌కి ఆయనగారు మేనేజరు కావచ్చు. ఎన్నాళ్ళుంటాడు.. రెండేళ్ళు...'' శాస్త్రిగారు టాపిక్‌లోకి వచ్చేసారు.

''ఆ తర్వాత ఆయన శబరిమలై వెళిపోయి అక్కడే సెటిల్ అయిపోవచ్చు... మరి రెండేళ్ళ తర్వాత నువ్వూ పోతావ?'' మేనేజరు వర్మగారు హెచ్చరించారు.

క్రిష్ణమూర్తికి చెమట పట్టింది - ఇద్దరు బాబాలు ఒకటైపోయినందుకు.

''నటరాజుగారు జోనల్‌మేనేజరు కాకముందు ఇక్కడే మన బ్రాంచిలో పని చేసారు. ఇక్కడయితే సదుపాయంగా వుంటుందని ఈ మాల సీజన్‌లో ఇక్కడకి వస్తారు. మనమూ పెద్దాఫీసరు కదా అని కంపెనీ ఇస్తాం... అదొక రెస్పెక్టు అంతే... మనకీ పుణ్యం పురుషార్థం కలిసివస్తుంది'' శాస్త్రిగారు వివరించారు.

''అవున్సార్...సారీసర్...స్వామి నిజం స్వామి... మన బ్రాంచిలో పూజలు బాగా చేస్తారని స్టేట్‌లోనే మంచి పేరుంది. వినాయకచవితికి విగ్రహాలు పెట్టడం, దసరా ఉత్సవాలు, విశ్వకర్మ పూజలు...'' క్రిష్ణమూర్తి ఇంకా బాగా పొవు కలిపేవాడే వర్మగారందుకొని ఇలా అన్నారు.

''మనం మంచివాళ్ళమని నీకూ నాకే కాదు, ఆ భగవంతుడికి తెలుసు. అందుకే లాంగ్‌స్టాండింగ్‌గా లాగించేస్తున్నాం.... ట్రాన్స్ఫర్స్ లేకుండా'' వర్మగారు గర్వంగా ఫీలయారు.

''ఇంతకీ ఎందుకు నవ్వావ్?'' శాస్త్రిగారు మళ్ళీ అడిగారు.

''మరీ అంత నవ్వా? మాకు చెపితే మేమూ నవ్వుతాం కదా?!'' వర్మగారు అడిగారు.

''స్వామియే శరణమయ్యప్ప.. మరేం లేదు స్వామి మా ఆవిడ పెట్టిన కితకితలు గుర్తొచ్చి నవ్వుతున్నానంతే...'' కోసేసాడు క్రిష్ణమూర్తి.

''మాల వేసుకొని అదేం ఆలోచనలయ్యా... అసలు ఆడవాసన పడని పూజయ్యా మనది. అది మర్చిపోకు...'' శాస్త్రిగారు హెచ్చరించారు.

''చిత్తం...'' ఎటువెళ్ళినా దొరికిపోతానని మరేమి అనలేదు క్రిష్ణమూర్తి.

''వెళ్ళు...వెళ్ళి మధ్యాహ్నానికి మడి కట్టుకొని మన స్వాములందరికీ వంటచెయ్యి. కొద్దిగ బుర్రపెట్టి వండు. డాల్డా నెయ్యి వేసే వేపుడు చెయ్యి. మసాలా వేస్తే జోనల్‌మేనేజర్‌గారు క్లాసు తీసుకుంటారు... సరుకుల లిస్టులో లేనివి తెచ్చుకో.. మన బ్రాంచిపేరు నిలబెట్టు. భగవంతుడూ జోనల్‌మేనేజరూ నీ శ్రమ వుంచుకోరులే.'' శాస్త్రిగారు బాధ్యతలప్పజెప్పారు.

క్రిష్ణమూర్తి ఏమీ అనలేక ఊ.. అన్నాడు.

''బియ్యంలో పప్పులో రాళ్ళుంటాయి... ముందు ఏరి, బాగు చేసి మరీ వండు. వంటికిందువడితే బాగోదు. అసలే జోనల్‌మేనేజరు గారికున్నవన్నీ పుప్పుళ్ళు...వాళ్ళు వంచకపోతే ట్రాన్స్‌ఫర్‌చేసేగల్రు.. నువ్వు రాళ్ళు ఏరకుండా వండావని, అవి తినడం వల్లే అవన్నీ కిడ్నీలో చేరాయని ప్రతిబ్రాంచికెళ్ళి ప్రచారం చేస్తాడు. జాగ్రత్త.. కేసు కూడా పెడతాడు కోర్టులో నీ మీద...'' వర్మగారు శాస్త్రిగారు చాలా విషయాలు వివరించారు.

'ఊ' అనకుండా బయటకొచ్చి గెస్టురూమ్‌లో వంట ప్రారంభించాడు. క్రిష్ణమూర్తి. నోటికి బూతులు వచ్చేస్తున్నాయి. తిడుతూనే లెంపలు వేసుకుంటూ 'స్వామియే శరణమయ్యప్ప' అని మధ్య మధ్యలో నోరుకట్టుకోలేక పోతున్నందుకు శరణుకోరుతూనే వున్నాడు. ఆ చికాకులో వేడి కళాయి దించబోతూ చెయ్యి కాల్చుకున్నాడు. ఆ ఊపులో మాల తీసేసి ఎవడినయినా తన్నేద్దామనిపించింది. ఎందుకో లలిత గుర్తుకొచ్చింది. ఆమెను కన్నవాళ్ళూ గుర్తుకొచ్చారు. అంతే... లుంగీతోనే ఆఫీసులోకొచ్చి ఫోనందుకున్నాడు. డయల్ చేసాడు. పదినిముషాలు ఏం మాట్లాడాడో తెలీదుగాని పూనకం వచ్చినట్టే మాట్లాడాడు. మాట్లాడాక కుదుటపడ్డాడు. ఒకే ఒక మాట మళ్ళీ అన్నాడు.

''ఎవడి బాబిక్కడ పనులు చేస్తాడు?''

• • •

వంటగదిలో వున్న పార్వతమ్మకు దబ్బుమన్న శబ్దం వినిపించి ముందరి గదిలోకి పరిగెత్తుకువచ్చింది. చూస్తే ఏకాంబరం నేలమీద పడివున్నాడు. ''అమ్మో... అమ్మో... ఈయనకేమయ్యిందిరా దేవుడో...'' అంటూ అరుస్తూనే ఏడుపందుకుంది. క్షణాల్లో ఇరుగూ పొరుగూ వచ్చి చేరారు. ఎవరో నాడిపట్టారు. మరెవరో ముక్కు దగ్గర చెయ్యిపెట్టారు. అంతా కలిసి బతికేవున్నాడని తేల్చారు.

'గాలి తగలనియ్యండర్రా...' ఎవరో అరిచారు. మరెవరో ఏకాంబరం ముఖం మీద నీళ్ళు చల్లారు. చల్లిన నీళ్ళని పెదవులతో చప్పరించుకున్నాడు ఏకాంబరం.

''చిన్నల్లుడూ కూతురు మరి గడికో గడికో దిగుతారు. పెద్దల్లుడు క్రిష్ణమూర్తి దూరాన వున్నాడు. లలితకు వాళ్ళ నాన్నంటే ప్రాణం.. ఫోన్‌చెయ్యండర్రా...'' పార్వతమ్మ గుండె బాదుకుంది.

అమ్మలక్కలు పార్వతమ్మకు ధైర్యం చెపుతున్నారు..

''లేదమ్మా ఇది గాచ్చారం కాదు.. ఈ మనిషి చేతులారా చేసుకున్నారు. వద్దు అన్నా విన్లేదు. అదేం పేపరుపత్రాలు ఎవ్వులో ఇచ్చినారని చెప్పి పట్టుకొచ్చి కూర్చొని మొత్తం చదివినారు. ఎవరో నాగదేవతట. భూమ్మీద పుట్టిందట. గుడికట్టమందట. మొక్కులు తీర్చమందట.

పూజలు చెయ్యమందట. తన గురించి లోకమందరికీ చెప్పమందట. అలగ చేసినోలికి - లంకెలు బిందెలు ఇచ్చిందట. బతుకుతెరువుకి నౌకరీలు వచ్చినాయట. ఆ దేవత గురించి పేపర్లపత్రాలు పంచినోలికి లాట్రీ తగిలిందట. వంద కాదు వెయ్యి కాదు లచ్చ... లచ్చ... రూపాయలు వచ్చినాయట. ఆ పేపర్లపత్రాలు చింపేసినాడట....ఎవుడో ఒకడు దేవుడ్లేడు... దెయ్యంలేదు అని చింపేసినాడట... మనూరి మేష్టుగోరి చిన్నకొడుకు లాటోడు. ఆడి మాటకేం గాని... అయితేటయ్యిందీ ఈ చింపినోడు ఎవుడయితే వున్నాడో ఆడి కొడుకు అప్పుడికప్పుడు బుక్కడు నీలడక్కుండ చచ్చిపోండట... అదిగో అది చదివేసి ఈ పెద్దమనిషి వూరుకోవలా ఆపేపరుపత్రాలు చింపేసినాడు... నాగదేవత్తల్లి ఈ రకంగ చూపించింది....తల్లీ నీకు పేపరు పత్రాలు పంచుతాను.. నీకు చీర చూపిస్తాను... కోడిపిల్ల కోయిస్తాను.. నా అయిదోతనం నిలుపు.. నా మగమనిషి ప్రాణాలు నిలుపు తల్లీ...'' ఆపకుండా-గుక్కతియ్యకుండా - గొంతు తగ్గకుండా చెప్పిన పారతమ్మ వాక్ప్రవాహానికి -

''ఛస్... నువ్వు నోర్మూయ్యి...'' అంటూ లేచికూర్చున్నాడు ఏకాంబరం.

పారతమ్మ భర్తని చూసి ఆనందంకన్నా ఆశ్చర్యానికే లోనయింది. ''ఏమండీ..'' అంటూ ఏకాంబరం చెయ్యిపట్టుకు తడిమింది.

''చెయ్యొదులు.. నాకేం కాలేదు.. కొద్దిగ కళ్ళు తిరిగినాయి... వెళ్ళండర్రా...'' అనేసి టేబుల్‌పైనుండి వేళాడుతున్న ఫోన్ రిసీవరు తీసి ఫోన్‌మీద పెట్టాడు. తర్వాత వాలుకుర్చీలో కూర్చున్నాడు.

అందరూ ఏదేదో గొణుక్కుంటూ ఎటువాళ్ళటు వెళ్ళిపోయారు.

కొద్దిసేపటికి పార్వతమ్మ ఒక్కర్తీ మిగిలింది. లేచి భర్తదగ్గరకు వెళ్ళి 'ఏమయిందండీ' అని మళ్ళీ కళ్ళలో నీళ్ళు తిప్పుకోబోతుంటే ''ఆగు...వద్దు.. నాకేం కాలేదు. అల్లుడు క్రిష్ణమూర్తి ఫోన్‌చేసాడు...'' చెప్పబోయాడు ఏకాంబరం.

''ఏమయిందండీ కూతురూ అల్లుడూ...'' గక్కురుమంది పార్వతమ్మ.

''అందరూ బాగున్నారు. నాకే బాగులేదు...కళ్ళు తిరిగాయంతే..'' ఏకాంబరం సర్దిచెప్పాడు. కూతురు అల్లుడు బాగోగులడిగి 'ఏమట' అడిగింది పార్వతమ్మ.

''ఏంలేదు, ఒళ్ళు ఎలాగుందని అడిగాడు క్రిష్ణమూర్తి...'' అంతకన్నా ఏమనిచెప్పాలో ఏకాంబరానికి అర్థంకాలేదు.

''ఆహా... మొన్నటికి నాకు జ్వరంకదా... అందుకే ఒళ్ళెలాగుందని అడిగుంటాడు. క్రిష్ణమూర్తి అల్లుడవడం మన అదృష్టం...'' పార్వతమ్మ నోరిప్పబోయింది.

''అమ్మాయి లలిత అన్నిపనులూ చేస్తుందని, చేదోడు వాదోడుగా వుంటుందని... అన్నిటికీ పనికొస్తుందని చెప్పి పెళ్ళి చేసామట. మేనమామనని నా మాట కొట్టలేదట. కాని అమ్మాయి పనికి రాదట..''ఏకాంబరాన్ని చెప్పనివ్వలేదు పార్వతమ్మ.

''మనమ్మాయి లలిత... పనికి రాదా? దేనికి..''

''అయ్యప్ప స్వామి పూజకి మాలవేసాడట క్రిష్ణమూర్తి. అందుకని లలితపనికిరాదు కాబట్టి పనిచెయ్యడానికి ఎవర్నో మగమనిషిని పంపమని గట్టిగా అదోరకంగా చెప్పాడులే..'' ఏకాంబరం ఇంకా క్రిష్ణమూర్తి మాటల్ని జీర్ణించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

పార్వతమ్మ మనసు తేలికపడింది.

'ఎవర్ని పంపండం అంటే ఎవర్ని పంపడం' అనుకొని భార్యాభర్తలిద్దరూ చాలాసేపు తీక్షణంగా ఆలోచించారు. చర్చచేసారు. ఎవరూ దొరకలేదు. వ్యవసాయప్పనులు మానుకొని ఎవరి వెళ్ళివుంటారో.. ఈ ఆపద ఎలా గట్టెక్కడమో అర్ధం కాలేదు.

''నేనే ఇంటికి మగదిక్కుని. నా ఆరోగ్యం బాగులేదు...'' అన్నాడు ఏకాంబరం.

''మీరు వద్దులెండి'' అంది పార్వతమ్మ.

ఏకాంబరం కొద్దిసేపు మౌనంగా వుండి ''ఎవర్నీ పంపకపోతే అమ్మాయికి విడాకులిచ్చేస్తాడేమో?!'' అనుమానాన్ని పైకే కక్కేసాడు.

''విడాకులా...'' పార్వతమ్మకు 'ఈమాత్రం దానికా' అని అనుమానం.

''విడాకులకేముందే విస్తిరాకులు ఏసినంత సులువు. సుబ్బయ్యగారి కూతుర్ని జుట్టుపండిపోయిందని దిగబెట్టేసాడల్లుడు. నోటిపళ్ళు పుప్పళ్ళయి వూడిపోయాయని వదిలేసాడు జానకిమొగుడు. ఆలిద్దరూ ఇప్పుడెళ్ళి 'కిరస్తాన్లలో' కలిసిపోయారు. అంతెందుకు అప్పారావు డ్యూటీకెళ్ళినప్పుడు ఆల ఆవిడ తుమ్మిందని, అందుకే క్రైమ్‌బ్రాంచోళ్లో ఎవులో రైడింగ్‌చేసి - దొరికిపోతే ఉజ్జోగం తీస్తారు కదా... ఆయమ్మ తుమ్మడమే ముప్పొచ్చిందని విడాకులు ఇచ్చేసాడా లేదా?'' ఏకాంబరం అడిగాడు.

అవునన్నట్టు తలూపింది పార్వతమ్మ. ఆమెకు లలిత గుర్తుకువచ్చి, మనుమలు గుర్తుకువచ్చి భయమేసింది. మనసులోనే విజయనగరం పైడితల్లికి మొక్కుకుంది.

''పూతికగాడ్ని పంపిస్తే...''ఏకాంబరం ముఖంలోకి వెలుగొచ్చింది.

''ఆడునలేచిక్కిసిన చీపురుపుల్లకన్నా సన్నంగుంటాడు. పూతిక(పూచిక) పుల్లలాగ. ఆడు దేనికి పనికొస్తాడు. ఆ పూతిక జబ్బు ఆడికి తోడు.. ఏదో బీరపీచు సంబంధమని మనం పనిచేసినా చెయ్యకపోయినా ఇంట్లో పెట్టుకున్నాం...'' అంది పార్వతమ్మ.

''....నేనయితే వెళ్ళలేను. నువ్వు ఫేంటూ చొక్కా తొడుక్కుంటావా చెప్పు...పూతికగాడు తప్ప మరోదిక్కు లేదు...'' ఏకాంబరం మాటే ఖరారయింది. క్రిష్ణమూర్తి తెల్లవారేసరికి తనముందు మనిషి వుండాలని ఆర్డరువేసి మరీ హెచ్చరించాడు. పూతికగాన్ని పూరుపంపాలని ఏకాంబరం కళ్ళంకి బయల్దేరాడు.

''సాయిరాం..'' అంటూ పలుకరించాడు దారిలో కనిపించిన పెద్దపాడు నర్సయ్య.

ఏకాంబరం చేతులెత్తి నమస్కారం చేసాడే గాని అతని నోట్లో మాట నోట్లోనే వుండిపోయింది.

నర్సయ్యని దాటి వీధిమలుపు తిరుగుతుంటే 'జై బాబా' అన్నాడు చిన్నం నాయుడు ఏకాంబరాన్ని చూసి.

'జై బాబా..' అన్నాడు ఏకాంబరమున్నూ.

''మా వూతికగాడు కనిపించడేటి?'' చిన్నంనాయుడిని అడిగితే అతగాడు తల అడ్డంగా వూపాడు. ఏకాంబరం తలదించుకొని ఇంకా ముందుకు నడిచాడు. అప్పుడు రిటైర్డుపంతులుగారు కనిపించారు. నిలువునామాలతో. ఆయన ఏకాంబరాన్ని చూసి పలికరింపుగా 'జై శ్రీరాం' అన్నాడు. సెయ్యిల పాపయ్య కనిపించి 'జై భవానీ' అన్నాడు.

''జై జై' అన్నాడు ఏకాంబరం అంతకన్నా ఏమనాలో తెలీలేదు.

వూతికగాడు కళ్ళంలో లేకపోవడంతో మళ్ళీ వీధిలోకొచ్చి బజారుకేసి నడిచాడు. దారిపొడుగునా 'సాయిరాం' 'జై బాబా' 'జై శ్రీరాం' 'స్వామి' 'భవాని' ఇంకా ఇలాంటివే పలుకరింపులు ఏమిటేమిటో ఏకాంబరానికి అర్థం కాలేదు. ఊరుమరమై పోతోందనుకున్నాడు.

''అయ్యగోరూ..'' కేకవినిపించింది. తలతిప్పి చూస్తే వూతికగాడు, ఆడి తలమీద సూట్కేసూ బేగులూ.. పక్కనే చిన్నల్లుడు చిదంబరం, చిన్న కూతురు జ్యోతి. అప్పుడే బస్సు దిగి ఇంటికొస్తున్నట్టున్నారు.

''బాగున్నార అల్లుడు గారూ... అమ్మా...'' అని కూతుర్ని పలుకరించబోయాడు ఏకాంబరం.

అల్లుడి ప్రతిపలుకరింపు అర్థం కాలేదు. ఎందుకంటే అతను 'మామయ్యా' అనలేదు. సాయిరామో, జైబాబో... ఇంకేదో అలాంటిదే అన్నాడు. ఏకాంబరం ఆ పిలుపుకి ఉలిక్కిపడి విన్నది మర్చిపోయాడు.

''ఇదేటిది మావూరే అనుకున్నాను... అన్ని వూరులకీ వాడలకీ అంటేసినట్టుగ వుండేటీ జాడ్యం.. వూర్లో అన్నా, తమ్ముడూ, దద్దా, తాత... అప్పా చెల్లీ వదినా ఏ వరుసలూ లేవు. వాటిపిలుపులూ లేవు. ఆ వరుసలున్నప్పుడు వూరంత ఒక్క కుటుంబంలాగ వుండేది. ఏ బందరకమూ లేని సంబోధన ఏది? ఇదేటిది ఏకంగా రక్తసంబంధీకులమధ్య పలుకరింపులూ పిలుపులూ కూడా ఓర్వాయనో.. ఓరి భగవంతుడా చుట్టుతిరిగి నీ దగ్గిరకే వచ్చాన్రా తండ్రీ... కాపాడు... కరుణించు...'' ఏకాంబరం లోపల లోపల గొణుక్కుంటూనే వున్నాడు. ఇల్లుచేరినా మనసలాగే వున్నట్టుంది.

పార్వతమ్మ ఏకాంబరాన్ని పక్కకు పిలిచింది.

''అల్లుడు ఏదో అన్నాడు...'' రహస్యంగా ఏకాంబరం చెవిలో చెప్పింది పార్వతమ్మ. 'ఏటన్నాడు?' అన్నట్టు సౌజ్ఞతోనే అడిగాడతగాడు.

''ఏదో అన్నాడు గాని... అర్థం కాలేదు'' గుసగుసగానే చెప్పింది పార్వతమ్మ.

''మనల్ని తిట్టాడా?'' అడిగాడు ఏకాంబరం.

కాదన్నట్టు అడ్డంగా తలవూపింది పార్వతమ్మ.

''అయితే ఏదో పలుకరించుంటాడులే...'' తన అనుభవాన్ని బట్టి చెప్పాడు ఏకాంబరం. కూతురు పిలుపుతో పార్వతమ్మ ఇంట్లోకి వెళ్ళింది.

అవాళ భోజనాలప్పుడు ''నేను తినేసి వెళ్తాను, మీ అమ్మాయిని పంపిస్తే వచ్చేస్తుంది.. నాకు అవతల టైంలేదు..'' చిన్నల్లుడిమాటలు ఆ అత్తమామలకు అర్థం కాలేదు. వస్తానని చెప్పి పిలవకుండా రావడమేమిటో? వచ్చిన అల్లుడు తానొక్కడే బయల్దేర్డమేమిటో బోధపడలేదు.

'అమ్మాయి' నోట్లో మాట పెగలకుండానే కూతురువంక చూసాడు ఏకాంబరం. పార్వతమ్మకు అనుమానంగానే వుంది.

భోజనం చేసి చెయ్యికడుక్కుంటూ కూతురు జ్యోతి మొదలుపెట్టింది.

''అమ్మా.. మరేం లేదు నాన్నా... మా విజయనగరానికి శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజియ్యరు స్వామిగారు వచ్చారు. ఆయనొచ్చి రెండువారాలు దాటిపోయింది. ప్చ్... ఇంకా వారమే వుంటారు. ఆయన ప్రసంగం ఎంత బాగుంటుందో... ఈ సైన్సు ఆధ్యాత్మికం ఎలా కలగలిపి వున్నాయో బాగా వివరిస్తారాయన. ఈయన్తో పనిచేసే వెంకట్రావుగారూ భాస్కరరావుగారూ అలాగే మనమున్న ఇంటిపక్కన వున్న లక్ష్మిగారు మన ఇంటిమీద వున్న విశాలాక్షివాళ్ళూ అందరూ ఆయన.. అదే ఆ త్రిదండి చినజియ్యరుస్వామి వారి కాళ్ళుకడిగి ఇంట్లో అడుగుపెట్టించుకున్నారు...'' జ్యోతి చెపుతూ చెపుతూ ఎందుకో నసిగింది. పార్వతమ్మ అందుకుంది.

''నువ్వూ ఆయనగోరి కాలుకడిగేసి ఇంట్ల అడుగుపెట్టించీ లేకపోనావ?..''

''అలాగే అనుకున్నానమ్మా... అయినా అందరూ ఎంత చిన్నచూపు చూస్తున్నారు తెలుసా అమ్మా... మనకేమీ లేదని జమ కట్టేస్తున్నారు. వాళ్ళ ఇంట్లో కాళ్ళు కడిగించుకున్న సంగతి ఒకటికి పదిసార్లు గొప్పగా చెపుతున్నారు. నాకు సిగ్గుగా వుంది... ప్రాణం పోతున్నంత బాధగా వుంది. మనమెందుకు ఇరుగూ పొరుగూ దగ్గర లోకువయిపోవాలి?'' ప్రశ్నించింది జ్యోతి.

''ఏం కాళ్ళు కడిగించలేదా?'' పార్వతమ్మ అడిగింది.

లేదన్నట్టు అడ్డంగా తల వూపి '' అయిదువేల రూపాయలవుతుంది. అడుగుపెట్టించడానికిఫీజు...'' చెప్పింది జ్యోతి. 'అయిదువేలే' ఆశ్చర్యపోయింది పార్వతమ్మ. ఏకాంబరానికి ఏదో బోధపడుతున్నట్టు గుటకలు మింగాడు. 'పైట పావడా మీద నడిచి వెళ్ళడానికే వెయ్యినూటపదహార్లు దక్షిణ గౌరవంగా ఇవ్వాలి. అయినా ఇప్పుడు అయిదువేలు

పెడితే ఏడాది తిరక్కుండానే అంతకు పదిరెట్లు.. లక్షలు వచ్చి చేర్తాయట...'' అది ఎలాగో ఇరుగుపొరుగుల వివరాలు చెప్పింది జ్యోతి.

''మీరెప్పుడు అయిదుపేలిస్తే నేనప్పుడు వెళ్తాను'' జ్యోతి నేలచూపులు చూడకుండా అంది. ఏకాంబరానికి పార్వతమ్మకి విషయం అర్థమయింది. తేరుకొని-

''రెండ్రోజుల్లో సర్దుతాను.. ఇస్తాను..'' ఏకాంబరం అనకతప్పలేదు.

''రెండ్రోజులయితే నేనూ వుంటానులే'' అన్నాడు అల్లుడు, త్రేన్చుతూ తిండిదగ్గర్నుంచి లేస్తూ.

పూతికగాడు అన్నం తిన్నాక ఒక్క క్షణమైన ఆగకుండా వాణ్ణి ఊరు బయల్దేరించారు ఆ వృద్ధదంపతులు.

* * *

అమ్మా... నాన్న ఇంకా ఎన్నిరోజులకి ఇంటికి వస్తారే?''

''అలాగే స్వాముల్లో కలిసిపోతే... ఇంటికి రాకపోతే?''

పిల్లల ప్రశ్నలకు సమాధానమివ్వకుండా లలిత మూగదానిలా వూరుకుంది. ఆమె చూపులు ఎటో చూస్తున్నట్టు వున్నా అవి అక్కడే లేవు... మనసు- కంటిముందు దృశ్యాన్ని స్తంభింపచేసినట్టు వుంది.

''వేసిన ప్రశ్నలే వేస్తే అమ్మయినా ఎంతని సమాధానం చెపుతుంది? అయినా టైం చూసారా.. రాత్రి పదకొండుదాటింది...తెల్లవారి లేవరా.. స్కూల్‌కు వెళ్ళరా... పడుకోండమ్మా'' తోడుకోసం ఇంట్లోపడుకోవడానికివచ్చినపద్మ పిల్లల్ని అనునయించింది.

కొద్దిసేపటికి పిల్లలిద్దరూ నిద్రలోకి జారుకున్నారు.

''పద్మా... నువ్వు పడుకో...'' లలిత చూపు మరల్చకుండానే అంది.

''ప్చ్...నిద్రరావడం లేదు...'' అంది పద్మ పక్కమీదవాలి.

లలిత ఏదో అనాలని అనుకుంది. కాని అనకూడని మాటలన్నట్టుగ ఆలోచనకు తోచి నోరువిప్పలేకపోయింది. కాని మనసు మాత్రం ఆలోచిస్తూ వుంది. పద్మ కొత్తపెళ్ళికూతురు. వాళ్ళాయన మాలవేసుకున్నాడు. ఎక్కడో స్వాములగదికివెళ్ళిపోయాడు. ప్చ్.. జాలేసింది. పద్మ వంక చూసింది.

పద్మ ఇదేమీ గమనిచకుండా టీవీ పెట్టింది. ఆ టీవీలో వచ్చే అరా కొరా... సీన్స్ ఏవో రిమోట్‌తో వెదుకుతోంది. అలా చాలాసేపు చూసి ప్రయత్నించి - తృప్తి పడలేక - రిమోట్‌తో టీవీని ఆపు చేసి పెద్దనిట్టూర్పు విడిచి అలానే పక్కమీదకు జారుకుంది. కళ్ళు మూసుకున్నా పద్మ నిద్రపోలేదని లలితకూ అర్థమయింది.

కొద్దిసేపు ఇద్దరిమధ్యా నిశ్శబ్దమే. ఒకర్నొకరు అర్థం చేసుకున్నట్టు చేసిందేమో.. మాటల్ని పెదవులు బిగబట్టి వుంచలేకపోయాయి.

''వీళ్ళు.. మన స్వాములు...ఏం చేస్తుంటారో..?'' పద్మ అంది.

''భజన చేసి చేసి అలసిపోయి మంచి నిద్రచేస్తూ వుంటారు..'' లలిత అంది. ఆమె లేచివెళ్ళి నైట్ బల్బు వేసి ట్యూబ్‌లైటు ఆర్పేసింది. ఆ తర్వాత పక్కమీద చేరింది.

''నేను ఇంటికి రాని మూడ్రోజులూ.. నాకు ఇష్టం లేదంటే చంపుకుతినే వారాయన.. అలాంటిది ఇన్నిరోజులు ఆయన ఇంటికిరాకపోయినా... ప్చ్... అంతే.. పుట్టింటికి పో లేదంటే' అంటారు. అమ్మా వాళ్ళూ అంతే.... అల్లుడు భక్తే కనిపిస్తుంది తప్ప ఇంకేమీ కనిపించదు...'' పద్మ ఇంక చెప్పుకోలేకపోయినట్టు గొంతు కూడుకుపోయింది.

లలిత ఊరడింపుగా ఏమీ అనలేకపోయింది.

''పాపం చిన్నపిల్లలు.. మనకే ఇలా వుంటే వీళ్ళ బుల్లిమనసులు...'' పద్మ వాక్యం పూర్తిచేయకుండానే పిల్లల్ని చేత్తో నిమిరింది.

అప్పుడు లలితమటుకు కదిలిపోయింది. కళ్ళలో నీళ్ళూరిపోయాయి. దుప్పటిలోనే తలవుంచి వలవలా కన్నీళ్ళు కార్చింది.

అప్పటికి చాలాసేపటి తర్వాత దుఃఖం పోయి మనసు బండగయిపోయింది. తనలా ఏడవడం తనకే నచ్చలేదు. లోలోపల కోపం తలెత్తడం వల్లనేమో కూడానిపని అనిపించి కళ్ళు తుడుచుకుంది. దుప్పటిమునుగుతీసి చూసింది. పిల్లల్లానే పద్మ కూడా అమాయకంగా నిదురపోతున్నట్టనిపించింది.

అలా లలితకు ఎప్పుడు నిద్రపట్టిందో గాని వీధిలోంచి నగర సంకీర్తనగా భక్తుల గుంపొకటి అరుస్తూ భజన చేస్తూ వెళ్ళిపోయింది. ఎవరో దాడికి వస్తున్నట్టు ఉలిక్కిపడి నిద్రలేచింది. ఆ అలికిడికిపద్మ, పిల్లలు కూడా లేచారు. అప్పటికిచలికాలం వల్ల తెల్లవారనట్టున్నా తెల్లవారినట్టు గడియారం సమయాన్ని చూపింది.

లలిత లేచి - పిల్లలు బద్దకిస్తుంటే లేపి చేతికి బ్రష్షులిచ్చింది. 'వాళ్ళ బ్రష్ చేయడం అయాక వేడినీళ్ళు పెట్టి స్నానం చేయించింది. టిఫిన్లు తయారుచేసి పెట్టింది. తింటూ టీవీ ముందు కూర్చున్నారు. పద్మ అప్పటికే టీవీ ఆన్‌చేసి చూస్తోంది.

శుభోదయం అక్షరాల వెంట అలకానందస్వామి నల్లని జుట్టు లాంటి గడ్డంతో ప్రత్యక్షం!.. అర్ధరాత్రి శృంగారం పేరట బూతుపాటలిచ్చిన టీవీ ఇప్పుడు ఆధ్యాత్మికతతో దర్శనమిస్తోంది. అలకానందులవారు భగవంతుని చేరే నిచ్చెనమెట్లని వివరిస్తున్నారు. తుచ్ఛకోరికల కోసం.. సుఖాల కోసం అజ్ఞానులు దేవున్ని విస్మరిస్తున్నట్టు ఆయన ఆరోపించారు. చెపుతూ చెపుతూ అంత మెత్తని పరుపుమీద కూడా ఆయన ముడ్డి కదిపారు - కదుపుతున్నట్టు కనపడకుండా.

పద్మ ఛానెల్ మార్చింది.

రాత్రి తారలూ వేషాలు మార్చి అపరభక్తులై గొంతుచిరిగి గుండె పగిలేలా గీతాలను ఆలపిస్తున్నారు. ఆ సమయంలో మబ్బుల మాటునుండి ఇంద్రాదిదేవతలు సృష్టి భగ్గుమనిపోతుందేమోనని భయపడుతూ ఆందోళనగా చూస్తున్నారు. ఇదేమీ పట్టించుకోకుండా శివుడు పార్వతితో కైలాసం కదిలిపోయేలా గెంతుతున్నాడు. తాళానికి పాదానికి తగ్గట్టు అతని మెడలోని పాము వూగుతోంది.

''పాము నిజింగదేనా?'' అడిగాడు గోపి.

''బొమ్మపాము కాదు నిజం పామే...'' చెప్పింది గీత.

''అందుకే అలా గెంతుతున్నాడు, కరిచేస్తుందేమోనని...'' గోపి సీరియస్‌గానే అన్నాడు. 'తప్పురా' అందామనుకొని ''వాగుడుకాయ వయిపోతున్నావ్'' అని అంది లలిత. ''లేదమ్మా అది నిజం పామే'' అని గీత – 'షూటింగ్ చూసిన ఫ్రెండు రవి చెప్పాడ'నీ చెప్పింది.

పద్మ నవ్వుతూ రిమోట్ నొక్కింది.

''భార్యాభర్తలలో – భర్త పూజలూ వాటి ఫలాలూ భర్తకే చెందుతాయి. భార్య చేస్తే మటుకు ఆ ఫలాలు భార్యాభర్తలిరువురికీ చెందుతాయి. అంచేత పెద్దలు నోములని... వ్రతాలని...'' పద్మ రిమోట్‌తో టీవీ ఆపేసింది.

''ఇంటికి వెళ్తానక్కా'' పద్మ చెప్పింది.

''వంట ఒక్కదానివి ఏంచేసుకుంటావ్ ఇక్కడికి వచ్చేయ్.. నువ్వు వేగం వస్తే పిల్లల్ని స్కూల్‌కు దిగబెట్టి రేషనూ బజారూ చేసుకువద్దాం'' లలిత చెప్పింది. పద్మ అలాగేనంటూ వెళ్ళింది.

టిఫిన్లు కానిచ్చిన పిల్లలు పుస్తకాలు తీసి హోమ్‌వర్క్‌లు చేసుకుంటూ చదువుకుంటూ కూర్చున్నారు. ఆ సమయంలో పిల్లలు విడిచిన బట్టలు ఉతికి ఆరేసింది. ఇల్లు చిమ్మింది. ఎక్కడివక్కడ సర్దింది. వంటచేసింది. కేరియర్ కట్టింది. పద్మ వచ్చేసింది రెడీ అయి.

''టైం అయిపోయింది'' గీత అరుస్తూ అంది.

''రోజూ లేటే.'' అన్నాడు గోపి బేగు భుజానికి ఎత్తుకొని.

''మీ యల్‌కేజీ – యూకేజీ చదువుల బరువు ఇంట్లో వందకేజీల్రా..'' అంటూ పద్మ పిల్లల తలలు దువ్వి పనిలో సాయపడింది.

''పొద్దుటపూట చావడానికి కూడా తీరికుండదని మా రుక్మిణక్క అంటుంది... నిజం, యమధర్మరాజు వచ్చి అవతల నిలబడి అరిచినా వెళ్ళలేను...'' లలిత ఎవరికి చెపుతున్నట్టో ఏకపాత్రాభినయం చేస్తున్నట్టో అనుకుంటూ కేరియర్లూ వాటర్ బాటిళ్ళూ బేగులో సర్ది 'పదండి' అంటూ తాళం కప్పతెచ్చింది. ఇంతలో పద్మ పిల్లలకు సాక్సులూ బూట్లూ తొడిగి లేసులు కట్టింది.

ఇంటికి తాళం వేసి స్కూల్‌కు దిగబెట్టేసరికి అరగంట ఆలస్యం.

''రోజూ మా మాష్టారు తిట్టడమే.. 'మీరు పిల్లలు బుద్ధి లేదు... మీ పెద్దవాళ్ళకయినా వుండొద్దా...' మా టీచరు అంటుంది'' అని చెప్పి గీత బేగ్ అందుకుంది. గోపి తన బేగు అందుకొని స్కూల్లోకి నడిచాడు.

''వాళ్ళ మాష్టార్లకి చెపుదామా?'' అంది పద్మ.

''ఏం చెపుతాం ఒక రోజైతే ఏదో...'' పెద్ద తప్పుచేసినట్టు స్కూల్లో అడుగుపెట్టడానికి ధైర్యం చాలక లలిత వెనుదిరిగింది. స్కూల్లోకి వెళ్ళిపోయిన పిల్లలకు టాటా చెపుతూ పద్మ లలితను అనుసరించింది.

'వదినా' అంటూ పిలుపు వినిపించి ఆగింది లలిత, వెంటే పద్మ కూడా.

లలితవాళ్ళు ఇప్పుడున్న ఇంటికి ముందు వుండే పాత ఇంటి పొరుగావిడ, కుశలం అడిగి ''ఇవాళ మీ అన్నయ్య వచ్చేస్తున్నారొదినా'' అంది. ఆమె ముఖంలో ఆనందంకన్నా ఆందోళనే ఎక్కువ కనిపించింది లలితకు. అందుకే కొత్తగా వింతగా చూసింది.

అది గమనించి సుశీల ''తెలుసుగదా.. మీ అన్నయ్య మాలవేసారు... మా అన్నయ్యా వేసారట గదా.. పోస్లే మన ప్రాణానికి హాయి.. ఈయన మండలంకు అదే ముందే వెళ్ళారు. ఇవాళే వస్తున్నారు... వస్తానొదినా అవతల మీ అన్నయ్య వచ్చేస్తున్నారు...'' చెప్పిందే చెప్పి పరుగుతీసింది. అర్థం కాక అదే విషయం లలితను అడిగింది పద్మ. ''అదేంటక్కా వాళ్ళాయన వస్తున్నారని అంత భయపడుతోంది, ఆనందించక... పైగా హాయిగుంటుందని...'' ప్రశ్న పూర్తి కాలేదు.

'ప్చ్..' అని నిట్టూర్చి ''సుశీలదొక కథ. వాళ్ళాయనకు అనుమానం... ఇక్కడ వున్నప్పుడే ఏదో మర్చిపోయానని ఆఫీసునుండి ఇంటికొచ్చి బాత్‌రూమ్ లేట్రీలు వెదికి వెళ్ళేవాడు. మధ్యలో ఫోన్‌చేసి సాయంత్రం ఏం కూరలు తేవాలో అడిగేవాడు... ఉల్లిపాయలు వున్నాయా? తేనా? అని అడిగేవాడు... ఈవిడ ఏ గుడికో.. ఇరుగింటికో.. పొరుగింటికో వెళ్తే.. అంతే. ఆ సాయంత్రం గొడవే. తాగేసి వచ్చి రోజూ తన్నులే తన్నులు... ఎక్కడికక్కడ కొట్టేసేవాడు....''

పద్మకి ఒళ్ళు జలదరించింది.

చెపుతూ నడుస్తున్న లలితను అనుసరించిందే కాని ఆ మాటలు పద్మ చెవికి చేరడం లేదు. తనకెందుకు లోలోపల భయం వేసి జంకు పుడుతున్నదో ఆమెకు అర్థం కాలేదు. బజారులో సరుకులూ, కూరలూ కొంటుంటే రోడ్డుగుండా తెల్లని గుంపు.. కుమారి ప్రజాపిత బ్రహ్మకుమారి పేరున బేనర్లూ జెండాలూ ఎగురుకుంటూ వెళ్ళాయి. కీర్తనల మధ్యమధ్యలో ఆత్మకీ శరీరానికి మధ్య ఏముందో ప్రసంగం సాగుతోంది.

సుశీల ప్రజాపిత ఈశ్వరీయ బ్రహ్మకుమారి మతం తీసుకోవాలని చెప్పిన మాటలు లలితకు గుర్తుకువచ్చాయి. మానసిక ప్రశాంతత దొరుకుతుంది... నువ్వు రా వదిన' సుశీల

కోరడం పద్మకు చెపుదామనుకుంది. సరుకులు తీసుకొని ఇంటివేపు నడుస్తూ వుంటే మరోగుంపు ఎదురయింది.

''వీళ్ళెవరక్కా?..'' పద్మ భయపడుతున్నట్టు లలిత వెనుకనే వుండి అడిగింది.

కాషాయరంగు దుస్తులు ధరించిన మగవాళ్ళు. మగవాళ్ళే అయినా నల్లని కాటుకా... ఎర్రని కుంకుమబొట్టు చేతికి గాజులు వేసుకొని వున్నారు. ఎటువంటి నినాదాలు లేకుండా వెళ్ళిపోతున్నారు.

లలిత కూడా ఆశ్చర్యంగా చూస్తోంది. ఆ గుంపు పక్కనుండే వెళ్తోంది, గుంపులో ఒకడు ఆగి ఎదురైన మనిషితో మాట్లాడడం స్పష్టంగా వినిపిస్తోంది. '' ఆ భవాని ఇంటికి భవానీ నువ్వు వెళ్ళావటగదా. ఈ భవానీ చెప్పాడు భవానీ.. ఆ భవానీ రానీ..ఏ భవానీ దగ్గరైనా తీసుకొని ఇచ్చేద్దాం ఈ భవానీకి అన్నాడు భవానీ...'' ఎదురైన మనిషికే కాదు లలితకూ పద్మకూ ఒక్కముక్క అర్థం కాలేదు. ఆ మాటలు వింటున్న మనిషి తలగోక్కున్నాడు. మళ్ళీ అవే భవానీ మాటలు...

''భవానీలు..'' లలిత అనుకున్నదో పద్మకు చెప్పిందో తెలీదు.

మూగవాళ్ళలా ఇద్దరూ ఇంటివేపు నడిచారు. రోడ్డుపక్క సినిమా వాల్‌పోస్టర్ల నడుమ 'చిన్నసాయిబాబా' ఫోటోలు. 'సాయిబాబా లాగేవున్నారే.' 'అవును చిన్న సాయిబాబాయే..' 'సత్యసాయిబాబాకు తమ్ముడు..' 'కాదు కొడుకు..' 'లేదు ఏమీ కారు..' 'ఇతను పేరు.. అతను పేరు..' ఎవరెవరో ఏమిటేమిటో మాట్లాడుతున్నారు.

ఇల్లు చేరారు. తాళం తియ్యడంతోనే పద్మ కుర్చీలో వాలిపోయి కళ్ళు మూసుకుంది. లలిత మాత్రం మిగిలిన వంట చెయ్యడానికి సిద్ధమయింది. ఇంతలో ఆగి తడుముకుంది. పద్మా అని పిలిచింది. 'నేనింటికి రాను, స్నానం చెయ్యాలి' చెప్పింది. పద్మ - నీళ్ళూ వసువూ పెట్టి తను వంట చూసింది. లలిత తలకు స్నానం చేసి వచ్చింది.

ఇంతలో ఇంటిముందు రిక్షా. పిల్లల్ని స్కూల్ ఆయా దించుతోంది. లలిత కంగారుగా పరిగెత్తింది. 'ఏమయ్యింది?' ఆమె గుండె వేగంగా కొట్టుకుంది. చిన్నాడు తూలిపోతుంటే పట్టుకుంది. ఒళ్ళు అగ్గిలా కాలుతోంది. ''తమ్ముడికి జ్వరం..'' గీత తల్లిని చూసి మరింత కళ్ళలో నీళ్ళు తిప్పుకుంది. పద్మ ధైర్యం చెప్పి అదే రిక్షాలో ఆసుపత్రికి తీసుకువెళ్ళింది. డాక్టరు చూసి ఇంజక్షనూ మందులూ ఇచ్చి సీజనల్‌ఫీవర్. అంతే.. తగ్గకపోతే వైరస్ ఇదేమో.. బ్లడ్ టెస్టు చేద్దాం' అన్నారు. లలిత తలాడించింది. తన దగ్గరున్న డబ్బులు చాలకపోతే పద్మ కొంత డబ్బు ఇచ్చింది.

అంతా ఇల్లుచేరారు. పూటికగాడు వస్తే భర్తకు కబురు చెప్పి రమ్మని మళ్ళీ తిప్పి పంపింది లలిత. కాసేపటికి క్రిష్ణమూర్తి వచ్చాడు. చెయ్యేసి అంటరానట్టు చూసాడు.

గోపి ముక్కుల్తున్నాడు... నాన్న...నాన్న అని పలవరిస్తున్నాడు.

లలిత క్రిష్ణమూర్తి కళ్ళలోకి చూసింది. అలా చూడ్డం క్రిష్ణమూర్తికి అస్సలు నచ్చలేదు. పైగా పక్కనే పద్మ ఇంకా పూతికగాడు కూడా వున్నాడు. అందులోనూ గోపీ 'నాన్న నాన్న' పలవరింత అమీను బోనులోకి పిలుస్తున్నట్టుంది. అంతకన్నా రెప్ప ఆర్పకుండా లలిత అలానే చూడ్డం క్రిష్ణమూర్తి భరించలేకపోయాడు.

''పిల్లాడికి ఏం పెట్టావ్?''

''ఏదో ఒకటి పెట్టాలిగదా.. నీలా ఒదిలెయ్యలేను..''

''నువ్వు తల్లివి కావా? బాధ్యత లేదా?''

''ఎవరికి వుందో ఎవరికి లేదో తెలుస్తోంది...''

అప్పుడు లలిత చూపుని తిప్పింది.

''సరిగ్గా చూస్తే నాన్న.. నాన్న.. అని పిల్లాడింత బెంగపెట్టుకోడు...'' క్రిష్ణ మూర్తి తన బాణాన్ని గురిచూసి వదిలాననుకున్నాడు.

లలితకూనోరు రాలేదు. పద్మకు కల్పించుకోవాలో వద్దో సంధిగ్ధంగా వుంది. పూతిక గాడికి మాత్రం '' ఏటితగాడి జోరు.. బూమి తన్నీసి ముప్పైరెండు బాగాలు సేసేత్తన్నాడు.. పెలిమి ఉత్తిపాతం... ఇలాటోడ్ని పట్టుకు ముక్కలిరగ తన్నీయాల.. కాని ఇంటి అల్లుడు అయిపోండు.. ప్చ్.. అనిపించి నిట్టూర్చి పెద్ద ఊపిరి తీసాడు.

''నీకు తల్లి పాడింలేదు..'' ఈ బాణానికి లలిత రెణ్నొల్లదాక నోరిప్ప లేదనిపించి, క్రిష్ణమూర్తి తన మాటని రిపీట్‌చేసాడు. నిజంగానే లలిత కూల బడిపోయింది. పద్మ నోరు విప్పబోయే సరికి అతనే మళ్ళీ అన్నాడు.

'' ఆడకూతురివి.. ఇంత వేళకా తలస్నానం చేసేది..?'' ఇంకా నీళ్ళు కారుతున్న లలిత జుట్టుని చూసి క్రిష్ణమూర్తికి మరింత సాక్ష్యమూ బలమూ దొరికినట్టు అడిగాడు. లలిత జవాబివ్వలేదు.

'' ఆవిడ ఇంటికి రాదు.. ఇందాకే..ము.. నెల వచ్చింది...'' పద్మ ఇంకా ఏదో చెప్పాలనుకుంది.. ఆమెకేదో అడ్డం వచ్చింది.. ఇంకా ఏదేదో మాట్లాడాలనే వుంది. కాని క్రిష్ణమూర్తి ఆమెకా అవకాశం ఇవ్వలేదు.

''స్వామి.. స్వామియే శరణమయ్యప్ప...'' పదిళ్ళకు వినిపించేలా అరిచాడు. అప్పుడే నిద్రలోకి జారుకుంటున్న గోపి అంత జ్వరతీవ్రతలోనూ ఉలిక్కి పడి లేచికూర్చున్నాడు. గీత కూడా ఎంత భయపడిందో ఏమో తల్లిచెంగు చాటుకు చేరింది. పద్మ వింతగా చూసింది. క్రిష్ణమూర్తి అరుపుకు పూతికగాడికి గుండె ఆగినంత పనయ్యింది. వాడు తుఫ్ తుఫన తనగుండెల మీద తానే ఉమ్మేసుకున్నాడు ''సీ ఆంజనీయం - పెసన్నాంజనీయం..'' వచ్చిన రొండు ముక్కలూ అనుకుంటూ ఎడమకాలిమట్టి తీసి నుదిటిమీద వీబూతిలా పెట్టుకున్నాడు.

క్రిష్ణమూర్తి '' ఎంత పని జరిగింది.. ఎంత అపచారం జరిగింది.. ఈ పాపం నీదే... ఈ మహాపచారం జరక్కుండా ముందే జాగ్రత్త తీసుకో.. నువ్వసలే కన్నె 'స్వామివ'ని చెవిలో ఇల్లుకట్టి కాదు ఆఫీసు ఆర్డరు వేసి మరీ చెప్పారు మా గురుస్వామి.. జోనల్‌మేనేజరు స్వామి.. ప్రాయశ్చిత్తం ఆయన్నే అడగాలి... ఈ మడీ తడీ వుండదనే ఈ దరిద్రం ఇంటికి రాను... ఎలాగిప్పుడు స్వామీ నువ్వే వున్నావు, తప్పుకాయి... 'స్వామియేశరణమయ్యప్ప' అంటూ కడుపు నడిచినోళ్ళలా పరిగెత్తాడు క్రిష్ణమూర్తి.

అతన్ని అనుసరించాడు పూతిక గాడు.

• • •

''నువ్విప్పుడు పంచగవ్యములతో స్నానం చేయాలి స్వామి.. అంతకు మించినమార్గం లేదు..'' గురుస్వామి జోనల్‌మేనేజరూ అయిననటరాజుగారు చెప్పారు. ఆయన గురుస్థానాన్ని తెలిపే మెడలోని కాషాయిపురంగు తువ్వాల్ని తీసి దులిపి మెడకు చుట్టుకున్నారు.

క్రిష్ణమూర్తి దిద్దుకోలేని తప్పు చేసినట్టు తలవంచుకు నిల్చున్నాడు. ఆయన్ని ముట్టుకుంటే ఎక్కడ పాప పంకిలమై పోతామోనన్నట్టుగ స్వాములందరూ దూరంగా నిల్చున్నారు. అది గమనించి బాగోదని పూతిక గాడూ దూరంగా నిల్చున్నాడు.

''శవాన్ని చూస్తే ఎంతో ఆ పిరియడ్స్‌లో వున్న లేడీస్‌ని చూస్తే అంత..! పంచగవ్యములతో నీ స్నానం జరిగి, ఆపైన నూటా ఎనిమిది దఫాలు శరణుఘోష చేయాలి. అంతవరకూ పచ్చి మంచి నీళ్ళు ముట్టకూడదు...'' విరుగుడు వివరించారు. నటరాజు స్వామి గారు.

''ప్రాణం పోయినా మంచినీళ్ళు కాదు మరుగు నీళ్ళుకూడా తాగనుసార్... సారీసర్. తాగను స్వామి.. తెలియక చేసిన అపరాధము..'' క్రిష్ణమూర్తి గురుస్వామి పాదాల వంక చూస్తూ అన్నాడేగాని కళ్ళెత్తలేదు.

''తెలిసి చేసినా తెలియక చేసినా తప్పు తప్పే... అయినా నువ్వు మొదటి సారేగదా మాలవేసింది, అందుకేమిమ్మల్ని 'కన్నెస్వామి' అన్నది. రెండవ దఫాకినువ్వేకత్తివయి పోతావ్. అందుకే రెండో దఫా మాలవేస్తే 'కత్తి స్వామి' అన్నమాట. మూడో దఫా 'గంటస్వామి'వి అవుతావు. ఎక్కడ తప్పుదొర్లినా గంటకొట్టినట్టు నువ్వే చెబుతావ్. నాలుగో దఫామాలవేస్తే 'గదస్వామి'. నువ్వెత్తిన గదకు తిరుగులేదన్న మాట. ఇక అయిదోదఫావేస్తే 'పెద్దస్వామి' లేదా 'పెరియస్వామి'. ఈ స్వాములన్నీ అయినాక నాలాగ 'గురుస్వామి' అవుతుంటారన్నమాట. అందరికీ సాధ్యం కాదులే..'' నటరాజ గురుస్వామి మెడలోని తువ్వాల్ని మరో మారు దులిపారు.

అందరూ మరోసారి గురుస్వామిని గౌరవంతో నమస్కరించారు. క్రిష్ణమూర్తి చేతులు జోడించి... ''గురుస్వామీ పంచగవ్యాలంటే ఏమిటో సెలవివ్వండి, మా పూతిక గాడు తెచ్చి పెడతాడు...'' అన్నాడు భక్తి పూర్వకంగా.

''పంచ అయిదు ఏమిటవి... ఒకటి ఉచ్చ, రెండూ పేడ, మూడు పాలు, నాలుగు పెరుగు, అయిదు నెయ్యి... ఈ ఐటమ్స్ అన్నీ ఆవువి మాత్రమే అయివుండాలి'' గురుస్వామి చెబుతుంటె- క్రిష్ణమూర్తి కంగారుగా '' ఆడ ఆవువా? మగ అవువా సర్. స్వామీ...'' అడిగాడు.

'' ఏమయ్యా చదివితే వున్న మతి పోయినట్టుగుంది నీకు. మొదటి రెండూతప్ప మిగతా మూడు మగ ఆవులిస్తాయా?'' గురుస్వామి నవ్వారు. అందరూ కోరస్ ఇచ్చారు. పూతికగాడు నవ్వు ఆపడం కష్టమయింది.

క్రిష్ణమూర్తి జాగ్రత్తగావిని, మరింత జాగ్రత్తగా ఆలోచించాలనుకున్నాడు. అంచేత అలాగే ఆలోచించగా - మొదటి రెండు ఉచ్చ, పేడ ఏ ఆవులైనా ఇస్తాయి. మిగతా మూడు వాటిల్లో పాలయితే ఇస్తాయిగాని పెరుగూ నెయ్యి ఆవులు డైరక్టుగా ఇవ్వవు కదా... అందామని ఆగిపోయాడు. ఈ పూజకి ఆడవానసే తగల కూడదే?! అందువల్లే ఇంత బాధ వచ్చి పడిందే?! మరి.. ఈ పంచగవ్యములన్నీ ఆడ అవువే కావాలంటున్నారేమిటి?....

'మగ ఆవులు ఇవ్వవు గనుక..' పూతిక గాడు అనలేదు, వాడి నవ్వుకి వాడలా అన్నట్టుగా తోచింది.

'ఆడజాతి పూజకు పనికి రాదుకదా' అందామనుకున్నాడు క్రిష్ణమూర్తి మళ్ళీ అంతానవ్వుతారేమోనని నోర్మూసుకొని హుందాగా వుందామనుకున్నాడు.

నటరాజుగురుస్వామి చేతి వాచీ వంక చూసుకున్నారు.

అది గమనించి క్రిష్ణమూర్తి'' ఓరే.. పూతికగా... ఇంకా ఇక్కడే నిల్చున్నావ? విన్నావు గదా పంచగవ్యములు పట్రా వెళ్ళు...'' అజ్ఞాపించాడు. పూతికగాడు కదలబోతుంటే ''ఆడ ఆవువే సుమా'' అన్నాడు మళ్ళీ హెచ్చరికగా.

'' ఆడదైతేనే ఆవు. ఆడావు అనరు. మగదయితే ఎద్దు..'' పూతికగాడి గొంతు పెద్దది. ఆమాట అందరికీ వినిపించింది. గురుస్వామి ఉలిక్కిపడి చూసారు. ఆచూపు, ఉలికి పాటు క్రిష్ణమూర్తితోపాటు అంతా గ్రహించారు.

పూతికగాడు అటు వెళ్ళగానే..''పొగరెక్కువ.. పూతిక గాడ్డికొడుక్కి... ఒళ్ళుంటే మరీ ఒప్పుకపోను...'' అన్నాడు క్రిష్ణమూర్తి. అందరూ ఆఫీసులోకి నడిచారు. క్రిష్ణమూర్తి ఒక్కడూ ఎండలో నిల్చున్నాడు.

మళ్ళీ పూతిక గాడు వెనక్కి వచ్చి '' ఈ సిటీలో పేడ... ఉచ్చ... అదీ అవుది ఆడ ఆవుది దొరకడం కష్టం. వూరెళ్ళి తెచ్చేమంటారా! లేకపోతే ఫోనుకొట్టండి... మీ మాయ్యగారున్నారు... పట్టుకొస్తారు...'' క్రిష్ణమూర్తితో అన్నాడు.

' ఇదేదో బాగుందే' అనిపించిది... 'కాని ఈ ఆఫీసు గాడ్డి కొడుకులు ఇవ్వాళ్టితో వదిలీరు. అత్తారింటినుండి బియ్యం, పప్పులూ ఉప్పులూ మొదలుకొని ఆవుపేడ దాక తెచ్చుకుంటావ్..' నీకేం ఖర్చు? అని కళ్ళు పొడుచుకోరూ.. చూడలేని నాయాళ్ళు అన్నా అంటారు' అనిపించి, అనుకొని '' అంత టైంలేదు... పంచగవ్యముల్తో నా స్నానమయితేనే నీకు భోజనం.. వెళ్ళు... అర్జెంటు...'' అన్నాడు క్రిష్ణమూర్తి.

పూతికగాడు ఎడారిలో తప్పిపోయినట్టు ఎటు వెళ్తున్నదీ తెలీకుండా కదిలాడు.

క్రిష్ణమూర్తి ఆవులు ఎక్కడెక్కడ తిరుగు తుంటాయో ఆలోచించాడు. 'లలితకు చెప్తే సరి... లలితా? తన్నుంచే ఇదంత రాలేదూ? లలిత 'ఇంటికి వచ్చాక ఇంటికి వెళ్ళి శుభ్రంగా తన్నేస్తే...' పెదవి మీది 'స్వామి శరణం' ఉచ్చరణ మనసునీ దాని ఆలోచననీ బంధించలేక పోతోంది.

ఇంతలో రావు గోపాలారావు తమ ఆఫీసుగదిలోకి వెళ్ళడంతో క్రిష్ణమూర్తికి మరింత బాధని పెంచింది. ఉన్నచోట నిల్చోలేక అటూ ఇటూ చూసి ఆఫీసుగది కిటికీకి చేరువగా నిల్చున్నాడు. సందులోంచి కనపడుతున్నారు. మాటలు వినపడుతున్నాయి.

స్వామి శరణం... స్వామి శరణం అనుకున్నారు.

'పర్సంటేజీ ఇద్దామని వచ్చాను, ఇప్పుడు వద్దులెండి స్వామి.. మళ్ళీ కలుస్తాను'' మెటీరియల్ సప్లయ్ చేసే రావుగోపాలరావు లేవబోయారు. ఆఫీసు సూపరెంటు శాస్త్రి, డిప్యూటీ మేనేజరు వర్మ ఇరువైపులా చేతులు పట్టుకొని కూర్చోబెట్టారు.

''మాలలో వున్నామనా? అలా అనుకోవద్దు. దేని పని దానిదే మాంసం కొట్టేవాడు మాల 'వేసుకుంటే మాంసం కొట్టడం మానేస్తున్నాడా? వడ్డీ వ్యాపారస్తులున్నారంటే బిజినెస్ మానేస్తున్నారా? సినిమాయాక్టర్లు మాలవేసుకుంటే నటించడం మానేస్తున్నారా'' శాస్త్రిగారు వివరించేరు.

''అంతెందుకండీ మా జోనల్ మేనేజరు గార్నే తీసుకోండి.. గురుస్వామే కాని ఆయనకింద ఖర్చులన్నీ మేమే చూసుకోవాలి.. ఒక రోజూ రెండ్రోజులూ కాదు.. నెలాపదిహేను రోజులు. ఇంకా శబరిమలై ఖర్చులు... తిరిగి వచ్చినపుడు... హి..హీ..హ్హీ.. మరీ ఖర్చవుతాయి. మీకు తెలియంది కాదు.. ఫిఫ్టీన్ వద్దు ట్వెల్వ్ పర్సెంటు ఇవ్వండి చాలు...'' వర్మగారు మరింత ఒత్తిడి చేస్తూ సాధక బాధకాలు వివరించేరు.

రావుగోపాల్రావ్ హేండ్ బేగులోంచి రెండుకవర్లు ఇద్దరి చేతిలో పెట్టారు. కాదు పెట్టకముందేసూపరెంటు, డిప్యూటిమేనేజరూ లాక్కొని జేబుల్లో కుక్కుకున్నారు. ఎంతో? ఎంతయినా గాని క్రిష్ణమూర్తి మనసు విలవిలలాడింది. గింజులాడుకున్నాడు. ఇందాక అపవిత్రమయిన దానికన్నా మరింత బాధగా వుంది అతనికి. మనసు పరివరి విధాలుగా పోతోంది.

నిష్ఠగా పూజ చెయ్యడమే వాళ్ళకి 'కలిసి వచ్చింద'ని పించింది. తను ఇలా చూడకూడనిది చూడ్డంవల్లే తనకి అందకుండా పోయిందని పించింది.

మనసుని కట్టు కుందామన్నా వల్లకాకుండా వుంది. జోనల్‌మేనేజరుగారికి చేప్పేస్తేనో? ఆయనే దొబ్బి తింటున్నాడు. ఏం మాట్లాడుతాడు...? నువ్వెన్నాళ్ళూ తినలేదా? అని పాతలెక్కలు అడిగితేనో?... త్రినాధస్వాముల వారి కథ గుర్తుకొచ్చింది. కథలో గరికపూసలు తీసిన వాడెవడో పేరు గుర్తులేదు కాని గరిక పూసల కిందన రెండుపైసలు మూడు పైసలు దొరికినవి. ఇంకా వుండునేమోనని చూసాడు. 'ఎంత దొరుకునో అంతే వుండును' చెట్టుమీద నుండి త్రినాధ స్వాములవారు ముక్తకంఠంతో చెప్పడం గుర్తొచ్చింది. ఇంకా వాళ్ళు తనకే చెబుతున్నట్లు అనిపించింది.

''కిటికీ దగ్గరేం చేస్తున్నావు క్రిష్ణమూర్తి స్వామీ....!'' జోనల్ మేనేజరుగారు తనగదిలోంచి అప్పుడే బయటకు వచ్చి అడిగారు. ఏం లేదన్నట్టు తల అడ్డంగా వూపాడు క్రిష్ణమూర్తి 'వెళ్ళి దూరంగా ఎండలో నిల్చో' తప్పుచేసిన విద్యార్థిని కసురుకున్నట్టే కసురుకున్నారు జోనల్‌మేనేజరు. క్రిష్ణమూర్తి వెనక్కి నడిచి చేతులు కట్టుకు నిల్చున్నాడు.

రావుగోపాల్రావ్ గారు నవ్వుతూ క్రిష్ణమూర్తి ముందరి నుండే వెళ్ళిపోయారు. జోనల్ మేనేజరుగారు అక్కడే వుండడంతో క్రిష్ణమూర్తి అతనితో ఏమీ మాట్లాడలేక పోయాడు. లలిత మీద కోపం వచ్చింది. ఈ నెల ఇంట్లో సగం జీతం కూడా ఇవ్వకూడదు' అని గట్టిగా అనుకున్నాడు.

ఆ రోజు క్రిష్ణమూర్తికి మధ్యాహ్నం భిక్షలేదు. కడుపు నకనకలాడింది. వూతికగాడ్ని తలుచుకొని గేటువంకే చూస్తూ నిల్చున్నాడు. ఓపికలేదు. కాళ్ళు తోడేస్తున్నాయి. నిస్సత్తువగా వుంది. కింద కూర్చుండి పోదామని అనుకున్నాడు.

అప్పుడు చీకటి పడుతుండగా వూతిక గాడు వచ్చాడు. వాడిచేతిలో సినిమాపోస్టర్లు అతికించే వాడిలాగ చిన్న బకేటు వుంది.

'' ఆడ ఆవుదేనా?'' ఆత్రంగా వెళ్ళాడు క్రిష్ణమూర్తి.

'' ఈ సిటీలో ఆడా మగా అన్నీ ఒక్కలాగే వున్నాయి. నాలాగ బక్కగ ఎండిపోయి మరీ.. ఏటి పోలుస్తాము.. అలా సూసితేవాలంటే నాల్రోజులు పడతాది, మీరు సెప్పినవన్నీ తేడానికి... మళ్ళీ వెళ్ళి కష్టమో నష్టమో తెమ్మంటారేటి?'' అని బకెట్‌తో తెచ్చింది పారేయబోయాడు వూతిక గాడు.

'' ఆ... ఆ... వద్దురారే... స్వామి...'' అంటూ తెచ్చిన బకెట్ అందుకున్నాడు క్రిష్ణమూర్తి అప్పుడే జోనల్‌మేనేజరు గురుస్వామి రావడం చూసి ''ఇది ఆడ .. కాదు.. ఆవుదే..నువ్వు రిపీట్ చెయ్యకు.. అస్సలు నోరెత్తకు... ఆ...'' వూతిక గాణ్ణి హెచ్చరించి మేనేజరు వంక చిన్నగా నవ్వాడు అతగాడు.

''సెబాష్. సంజీవిని పుల్ల తెచ్చిన ఆంజనేయుడ్లా అతన్ని బతికించుకున్నావ్?'' జోనల్ మేనేజరూ గురుస్వామి నటరాజు గారు పూతిక గాణ్ని మెచ్చుకున్నారు. పూతికగాడు బుగ్గలు పొంగించి కండలు బిగిద్దామనుకున్నాడు కాని '' ఒరే.. పూతికా.. స్వామీ.. ఈ పంచగోవ్యములతో గురుస్వామి చెప్పినట్లు చెయ్యి'' అన్నాడు క్రిష్ణమూర్తి.

సాయంత్రం పూజకు టైం కావస్తూవుండడంతో ఒళ్ళు మండిన నటరాజు స్వామి క్రిష్ణమూర్తి మాటలకి ''కళ్ళాపి చల్లి ముగ్గులు పెట్టడానికి తెమ్మనలేదు పేడ పంచకమూ అన్నీనూ... అవన్నీ వంటికి రాసుకొని తలస్నానం చెయ్యి...'' అంటూ ముక్కు మూసుకున్నారు. ఆ బకెట్‌లో చెయ్యిపెట్టడానికి క్రిష్ణమూర్తి భయపడుతూ పూతిక గాడివంక చూసారు. పూతికగాడు కూడా ముక్కు మూసుకొని ఆమడ దూరం వెళ్ళి నిల్చున్నాడు. క్రిష్ణమూర్తికి ఒళ్ళు మండింది. కాని గురుస్వామి ఎదురుగా వుండడంతో గుటకలు మింగాడు.

''నిన్నేమి ఆ పంచగోవ్యములు తాగమన్నానా ఏమిటి? ఆఫీలింగే మిటి.. అవతల పూజకు టైమవుతోంది...'' గురుస్వామికి ఆ విషయంలో ఒక ఇంక్రిమెంటు కట్‌చేసెయ్యాలి అని కూడా అనిపించింది.

క్రిష్ణమూర్తి ఆముద్దను చేతుల్లోకి తీసుకొని- ముక్కు దగ్గరపెట్టకూడదను కుంటూనే పెట్టాడు. డోకు వచ్చినా బలవంతాన ఆపుకున్నాడు. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పూతికగాడి జాలిగుండె కరిగిపోయినట్టుంది. వాడు దగ్గరగా వచ్చి ఆముద్దని బాగా కలిపి పసుపు రాసినట్టుగా క్రిష్ణమూర్తికి ఒళ్ళంతా పామాడు.

గురుస్వామి ఆవాసనకు మరింత వెనక్కి జరిగారు.

''పేడేనా ఇది..?..'' క్రిష్ణమూర్తి అనబోయి రుచి చూడవలసి వస్తుందని సైగచేసాడు.

పూతికగాడికీ ఒళ్ళు మండినట్టుంది...'' ఊరెళ్ళి తెస్తానంతే వద్దన్నారు తవరే. ఈ వూర్లో ఆవులు గడ్డి తినవు.. అడ్డమైన సినీమా పోస్టర్లు తింతాయిగదా... ఆమాత్రం ఇది వుంతాది, ఓర్సుకోవాల.. '' నీతిచెప్పాడు. రాసినదాని మీదనీళ్ళూ పోసాడు. నచ్చురాయకూడ దని, మన్నుతీసి పామాడు.

మొత్తానికి క్రిష్ణమూర్తి తిరిగి పునీతమయ్యాడు. అయినట్టుగా గుండె తేలికయింది. ఆలస్యంగానైనా సాయంత్రం పూజకు అందాడు. గంధం పూసుకొని దుస్తులు మార్చాక ఇంక పరవాలేదని పించింది.

పూజకు వచ్చిన (మాలవేయని) భక్తులు స్వాముల కాళ్ళకు మొక్కారు. ఒకరొకరూ క్యూకట్టిమరీ. క్రిష్ణమూర్తి తేరిపార చూసాడు. తన చేతిని తనే చిక్కుకున్నాడు. నిజమే. జోనల్‌మేనేజరు కాళ్ళ మీదపడ్డట్టే నూపరెంటు, డిప్యూటీ కాళ్ళమీదపడ్డట్టే- తనకాళ్ళమీద పడుతున్నారు. నేలమీద వున్నట్టులేదు. ఎక్కడో దేవలోకంలో తేలిపోతున్నట్టువుంది. అలా కాళ్ళకు నమస్కారం పెట్టిన వాళ్ళలో - అడ్డమైన కామెంట్ చేసే ఆఫీసు స్టాఫ్ ఇంకా తనతో

తగువు పెట్టుకున్న వాళ్ళూ తనని తిట్టినవాళ్ళూ వున్నారు. వాళ్ళంతా తన కాళ్ళమీద పడుతున్నారు. దాన్తో అతని అంతరాత్మ సేదతీరినట్టు పెదవులపై చిరునవ్వు తొణికింది. ఈ కమనీయ దృశ్యం వీడియో తీసి లలితకు చూపిస్తే బాగుణ్ణ'ని ఏమూలో అనిపించింది కూడా!

• • •

పూతికగాడు ఆసుపత్రి బెడ్డు మీద అపస్మారకంగా పడుకొని వున్నాడు. కళ్ళు తెరిచినట్టో మూసినట్టో తెలీదుగాని అప్పుడపుడూ భయంతోనో బాధతోనో వాటి రెప్పలు కొట్టుకుంటున్నాయి. చాలా సేపటికోసారి మాత్రం కళ్ళు తెరిచి చూసి అంతలోనే మూసుకుంటున్నాడు. దుప్పటి కప్పినా చలి జ్వరం వల్ల వణుకుతున్నాడు.

అసలు వాడు వాడి పక్కనున్న కటింగుబ్రెడ్డు, ద్రాక్ష, బత్తాయి పళ్ళు చూసి దిగ్గున లేవాల్సిందే, లేవలేదు. వాటి వాసనకు ఏజబ్బయినా పూతక జబ్బు తప్ప, అరక్షణంలో తగ్గిపోవాల్సిందే. అలా తగ్గలేదు. గోళీలూ సూదిమందులు కూడా పన్చేయడంలేదు.

అదేవిషయాన్ని డ్టాక్టరుగారు తన భాషలో లలితకు అర్థమయేట్టు చెప్పారు. ''మీరు తెచ్చిన పేషంటుకు న్యుమోనియా... బాగా ఎక్కువయిపోయిందని సరిపెట్టలేం. దాదాపు ఫైనల్‌స్టేజి... ఈ పరిస్థితుల్లో ఏం చేసినా కష్టం.. ఇలాంటివాళ్ళు ఈ శీతాకాలంలో మంచులో తిరగడం చన్నీళ్ళు స్నానం చేయడం... అదే పనిగా చేయడం మంచిదికాదు... ఇంతకీ ఇతను ఏంచేస్తాడు?'' డ్టాక్టరు గారు అడిగారు.

'అయ్యప్ప స్వాములందరికీ సేవలు చేస్తాడు, కాదు మా ఆయన చేయిస్తాడు' అని లలిత చెప్పలేకపోయింది. మాటరాని దన్లా మౌనంగా వుండిపోయింది.

ఇంకా అర్థం కావడానికో పేషంటు పొజిషన్ చెప్పడానికో డ్టాక్టరుగారు మళ్ళీ ఇలా అన్నారు - ''జలుబు చేస్తే ముక్కు ఎలా పట్టేసి వూపిరాడదో... అలాగే అతని గుండె నిమ్ము పట్టేసి ఊపిరి తిత్తులకు గాలి పీల్చుకోవడం కష్టంగా వుంది..''

డ్టాక్టరుగారి మాటలు-పూతిక గాడు మరి బతకడు అని చెపుతున్నాయి. లలిత పద్మవంక చూసింది. గోపీగీత అక్కడే నిలబడ్డ అప్పుడప్పుడూ పూతికగాణ్ణి చూస్తున్నారు. వారికి పూతిక గాడి ఏష్టేట్లు గుర్తుకొచ్చాయో లేక వాడు వేసిన గుర్రప్పందు, గుడుగుడు ముత్తెం గుండే రాగం...' గుర్తుకొస్తున్నాదో ఏమో.. పూతికగాడి గుండె ఏరాగమూ పలుకుతున్నట్టులేదు. ఇది పాముల పట్నమే' అందుకే 'పటికీ బెల్లం' లేదన్నట్టు - వాడు తన ఖాళీ చేతుల్ని తిప్పడం గుర్తొస్తోంది.

''పేషెంటుని వీలయినంత త్వరగా తీసుకెళ్ళి పొండి.'' డ్టాక్టరుగారు చెప్పేసి ఏదో ఆపరేషనుందేమో థియేటర్లోకి దూరిపోయారు.

లలితకు మాటరాక పద్మవంక చూసింది.

''అక్కా... పేషెంటుని బట్టికూడా వైద్యం చెయ్యొచ్చో లేదో కనీసం ప్రయత్నం చెయ్యొచ్చో లేదో డాక్టర్లు నిర్ణయిస్తారు... కాయల్లేని చెట్టుకు ఆకులు దులుపుతూ ఎవరు కూర్చుంటారు చెప్పు... నాల్రోజులయింది... ఇంటికి ఫోన్‌చెయ్యి... మీవారికి చెప్పిరా... పిల్లలతో కాపలా నేనిక్కడవుంటాను... వేగంగా వెళ్ళు...'' పద్మ చెప్పి రెండు చేతుల్తో పిల్లల్ని తన వేపుకి లాగింది.

''జాగ్రత్త'' అని చెప్పిలలిత కదలబోతే, పిల్లలు ''మేమూ వస్తాం... నాన్నస్వామి దగ్గరికి'' అంటూ వెంటబడ్డారు. కాదని చెప్పే ఓపిక, ఒప్పించే సమయమూ లేక పిల్లల్ని వెంట బెట్టుకొనే ఆఫీసుకు బయల్దేరింది.

అడుగులు అలవాటుగా పడుతున్నా 'అయ్యో... పూతికగాడు ఎంత దూరం నుండి వచ్చాడు. ఎక్కడినుండి ఎక్కడికొచ్చి ఇక్కడ చచ్చిపోతున్నాడు....' మనసు భారమై నడక వేగం నెమ్మదిస్తోంది.

'ఏదిక్కూ లేనోళ్ళకి దేవుడే దిక్కంటారే....' అనుకుంటూ వుండగా సాయిబాబా ఆలయం రోడ్డు మలుపు తిరిగే దగ్గర అగుపించింది. లలిత ఎందుకో ఒక్క క్షణం ఆగింది. ఆమె చూపులు ఆలయంలోకి ప్రవేశించాయి. నిలువెత్తు ఎతున- మనిషి పొడుగున వుండి ఎర్రటి దబ్బపండులా మెరుస్తూ చింపిరిజుట్టు వింతసోయగాన్నిస్తోంది. ఆమె తన్మయత్వం తో కాకపోయినా తదేకంగా చూసింది. అందువల్ల ఆచూపు భగవాన్ వారి పాదాల వరకూ వెళ్ళింది. పాదాలకు పావకోళ్ళు... శ్రీరాముడులాగే సాయిరాముడు కూడా. నిజంగా బాబాగారే ఎదురైనట్టుగుంది విగ్రహం. ఆమె దృష్టి లోపమేమో పాదాల్నే కాక ఆపాదాల పక్క భాగానున్న వినాయకుడు.. ఎలకంతేవున్న చిన్ని వినాయకుడునీ చూసింది. పావుకోళ్ళంత ఎత్తైనా లేడు వినాయకుడు... అంచేత ఎలుక ఎక్కడా కనిపించలేదు. క్రిష్ణమూర్తి అన్నట్టు లలిత బుద్ధిలేనితనం వల్లనేమో ఆ పరిస్థితిలో వున్న వినాయకుణ్ని చూసి 'దేవుడికే దిక్కు లేదు పాపం' అనుకుంది.

పిల్లలిద్దరూ తొందరపెడితే నమస్కారమయినా పెట్టకుండానే కదిలింది. దారి మధ్యలోనే పబ్లిక్ బూత్ నుండి ఊరికి ఫోన్ చేసి తల్లిదండ్రులకు విషయాన్ని తెల్పింది. ఆ తర్వాత ఆఫీసుకు చేరుకుంది.

అయితే ఆమెకే కాదు. పిల్లలకు కూడా అది గవర్నమెంటు ఆఫీసులా తోచలేదు. పెద్ద ఆలయం అనడం కన్నా చిన్న శబరిమలై అనడం బావుంటుందేమో అన్నట్టుగా వుంది. కాని వినవస్తున్నపాటలు చూస్తే ఆర్కెస్ట్రా జరుగుతుందేమో ననిపించింది. తల్లీ బిడ్డలు దగ్గరగా వెళ్ళి చూసారు.

పాటలాగాయి...

మధ్యలో ఎవరో.. కాదు క్రిష్ణమూర్తే. మైకందుకొని అనౌన్సుమెంటు ఇస్తున్నాడు. చేతిలో చీటీ చూసి మంచి ఫీలింగుతో చదువుతున్నాడు.

''రేపు ' ఇరుముడి' సందర్భంగా.. రేపు భక్తులందరూ ప్రయాణమవుతున్నారు. గనుక భక్తి ఆనందోత్సవాలను పంచుకోవడానికి మా' అయ్యప్పా అసోషియేషన్' ఇవాళ ఏర్పాటు చేసిన నాద బ్రహ్మోపాసన వింటారు. ఇందులో త్యాగయ్య క్షేత్రయ్య పదాలు వింటారు... రండి దయచేయండి''

'' ఇప్పుడు త్యాగయ్యనీ క్షేత్రయ్యనీ ఎక్కన్నుండి తెస్తావయ్యా... అన్నమయ్యని తెద్దామన్నా ఇప్పుడు ఎక్కడాడుతోందో తెలీదు.. నాగార్జునమేష్మం విప్పేసి ఇంకెదో...'' ఇంకేదో చెపుతున్నాడు ఆజోకుకు నవ్వులు... మరో పక్క నిరసనలు - అందువల్ల మరి వినిపించలేదు. అయితే ఇంత గోలనీ చీల్చుతూ ఒకపాట పైకిలేచింది.

''స్వామూలూ సాములు..

'స్వాములు..'' అనగానే-

'సెయ్..సెయ్' అన్నారందరూ.

''స్వాములు సెయ్య - స్వామికి పూజలు సెయ్య...'' పాట ప్రవహంలా సాగి పోతోంది. దప్పూతోడయింది.

'అమ్మా' అని లలితను గుంజాడుగోపి.

''బావలో బావలూ.. బావలుసెయ్య.. పాటమ్మా ఇది బావలు సెయ్యపాట..'' కని పెట్టేసి నట్టుగ గోపి ఆనందంగా అరిచాడు.

''బావ-బామరిది' సినిమాలోదే ఆపాట...''' హోటల్లో కప్పులు కడిగే కుర్రాడు తన ఈడుగా కనిపించిన గోపీతో అన్నాడు.

లలిత విందేకాని ఏమీ అనలేదు. క్రిష్ణమూర్తి తనని చూస్తాడేమోనని కన్ను తిప్పకుండా ఆయనవేపే చేస్తూవుంది.

వస్తున్న పాట పూర్తయింది. కాకుండానే మరో పాట మొదలైంది.

''మాల వేసి సబరికి పెళ్దామూ - ఓస్వామి..

మకరజ్యోతిని మళ్ళీ చూద్దామూ - నా స్వామీ''

ఇది ఏపాటో అర్థంకాలేదు గోపీగాడికి. ఇందాక గోపీతో మాట్లాడిన కుర్రాడు 'ఏదోపాత సినిమా, నాగేశ్వరావుది..' అంటున్నాడు. గీతకు ఈపాట టీవీలో చూసినట్టుగ అనిపించింది.

'పచ్చబొట్టూ చెరిగి పోదూలే నారాణి

పడుచుజంటా చెదిరీపోదులే నారాణీ' పాట గుర్తుకు వచ్చింది లలితకు. అయినా ఏమీ మాట్లాడకుండా మరింత దగ్గరగా పెళ్ళి క్రిష్ణమూర్తిని పిలిచింది. క్రిష్ణమూర్తి పలికేలాలేదు.

అతని కళ్ళముందు వాణిశ్రీ కనిపిస్తోంది. ఎవరో చెయ్యిపట్టి ఆపి, లాగి, కుదిపితే అప్పుడు అతని కళ్ళముందు లలిత కనపడింది.

''నువ్వెందుకొచ్చావ్ ఇక్కడికి..'' క్రిష్ణమూర్తి లలితకు ముందు అవకాశమివ్వలేదు.

''పూతికగాడు చావు బతుకుల్లో వున్నాడు'' లలిత ఆదుర్దాగా చెప్పింది.

''నేను డ్యాక్టరు క్రిష్ణమూర్తిని కాను, క్రిష్ణమూర్తి స్వామి బియ్యేని.. వెళ్ళు. వెళ్ళి డ్యాక్టరుకు చెప్పుకో..'' క్రిష్ణమూర్తి అందకుండా గుంపులో కలిసాడు. లలిత వెంట పడినా ప్రయోజనంలేదు, అతగాడు పని వున్నట్టు అక్కడికక్కడే మనుషుల్ని తప్పించుకు తిరుగుతున్నాడు.

''అక్కా..'' అంటూ లలిత మీద చెయ్యి పడేసరికి ఆగి వెనక్కి చూసింది. పద్మ రొప్పుతూ వచ్చినట్లుంది. అలసటను తట్టుకోలేక నోటితో గాలి పీలుస్తూ అంది. ''అక్కా... అక్కా.. మరేమో.. పూతికగాడు బెక్కుతున్నాడు. సరి.. పద.. ఆఖరి నిముషంలో నయినా మాట్లాడుదువు..'' పద్మ కొంగుతో ముఖం ఒత్తుకుంది.

పిల్లలిద్దర్నీ 'మీనాన్నని వదలకండి'' అని లలిత రెండు అడుగులు వేసి 'నేవచ్చిన వరకు ఇక్కడే వుండండి.. ఎటూ వెళ్ళకండి' అరుస్తూనే పద్మ వెంట పరుగు తీసిందిలలిత. పిల్లలుకూడా పరిస్థితిని గమనించినట్టున్నారు, వెంటపడలేదు.

రిక్షా ఎక్కి తొందరపడి ఆసుపత్రికి చేరుకున్నారు. గదిలోకి వెళ్ళి చేస్తే పూతికగాడి ముఖం కనిపించకుండా తెల్లని గుడ్డకప్పివుంది. కొయ్యబారిన లలిత ఇంకా నమ్మలేనట్టు 'డ్యాక్టరు' అడగబోయింది. నర్సుచెప్పింది. 'పేషెంట్ పోయాడు..' అని, ఒకే ఒక్క క్షణం వ్యవధి ఇచ్చి 'బిల్సు పే చేసి తీసుకెళ్తారా?' అడిగింది.

పద్మ ఆగుమనట్టుగా చేతి స్నాజ్ఞ చేయబోయింది.

'' ఆసుపత్రిలో వుంచడానికి వీల్లేదు, ఇదిచిన్నాసుపత్రి, మార్చురి సౌకర్యంలేదు పైగా మిగతా పేషెంట్లు శవం వుందంటే భయపడతారు. ప్లీజ్' నర్సుచెప్పింది. ఆవిడ అన్నమాటే మరో నర్సు తిప్పి మళ్ళీ అదే మాట చెప్పింది.

అప్పటికే వీధిలో దీపాలు వెలిగి గంట కాలంపైగానే అవుతోంది.

ఏం చెయ్యడం అన్నట్టుగా చూసింది లలిత.

''మీ ఊరినుండి మీవాళ్ళు వచ్చి పొద్దున్నే తీసుకు వెళ్తార్లే. ఈ రాత్రిపూట ఏం చెయ్యగలం? మన ఇంటికి తీసుకు వెళ్తే మేడపైన కదా ఎక్కించడం కష్టం. కింద మంచు. హౌస్ ఓనర్సు ఒప్పుకోరు పైగా...'' పద్మ తోచింది మాట్లాడుతోంది.

లలితకు ఏమీ తోచడం లేదు. పూతికగాడితో చిన్నతనం నుండి వున్న అనుబంధం గుర్తొచ్చి దుఃఖం గడ్డకట్టుకు పోతోంది. కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. 'ఇక్కడ బంగారం లాగుండోడు, ఆడికి జబ్బేటికొత్త?.. పుట్టిన్నుంచి వున్నదే!... అల్లుడింటికిపట్నంపంపించి

ఏం చేసినారో.. ప్రాణం పోయింది' అపవాదో అదే నిజమో ఏమో గాని ఎవరో అంటున్నట్టుగా లలితకా మాటలు వినిపిస్తున్నాయి.

'' ఇంటికి తీసుకెళ్ళి మళ్ళీ తెచ్చే కన్నా మీవారి ఆఫీసుకు పోదాం, వాళ్ళే ఏదో వెహికల్ ఎరేంజ్ చేస్తారు...'' పద్మ ఆలోచనగా అంది. నర్సులూ చుట్టుపక్కల చేరిన వాళ్ళు ' అదేమంచిపని.. అలాగే చెయ్యండ'ని అందరిదీ అదేమాట.

బిల్లులన్నీ పేచేసాక రిక్షాల్లో శవాన్ని ఎక్కించి; మరో రిక్షాలో పద్మ, లలిత క్రిష్ణమూర్తి ఆఫీసుకు చేరుకున్నారు.

రిక్షాలు రెండూ గేటులోకి రాకముందే ఈ వార్తతెలిసి - వాసనతెలిసి - భక్తులందరూ పటాపంచలైపోయారు.

అణుబాంబు ఆఫీసు ఆవరణలో పడునున్నట్టు గురుస్వామి.. అతనితో పాటు ఆఫీసు స్వాములందరూ - శవానికి ఎదురు వెళ్ళ కూడదని బయటకు పోలేక - ఆఫీసురూమ్‌లోనే పరుగుపరుగున పోయి దాక్కున్నారు. క్రిష్ణమూర్తి అందరికంటే ముందే గదిలో చేరి తలుపు వేసాడు. అనుకోకుండా అందరూ ఒకే గదిలో చేరారు.

రిక్షా గేటులోకి వచ్చిన చప్పుడు గుండెల్లోకి రైలు వచ్చినట్టుంది.

పద్మ లలిత ఆఫీసుగది పేపు రాసాగారు.

తలుపు సందులోంచి అదిచూసి గురుస్వామి గుండె బాదుకున్నాడు. ' ఇదినా ఎనిమిదో యాత్ర.. ఇంత అర్ధాంతరంగా... అమ్మో... ఇంకా శవాన్ని చూడలేదు, చూస్తే ఇంత నిష్ఠా నీట్లో కలిసిన నీరయిపోతుంది... ఇప్పుడెలా.. ఎలా?''

అందరూ 'ఎలా ఎలా?' అనుకున్నారు. అందరూ కలిసి క్రిష్ణమూర్తిని తన్నేద్దామనుకున్నారు. మాలవేసి వుండడం అడ్డయిపోయింది. 'నిన్నూ..' అంటూ పిడికిలి బిగించి వచ్చినా, ఆ మాలే క్రిష్ణమూర్తికీ రక్షణ అయింది.

అంత టెన్షన్ లోనూ ప్రాణభయం తప్పినందుకు 'భగవంతుడున్నాడు' అని అనుకున్నాడు క్రిష్ణమూర్తి.

''నానిష్ఠ చెడనీ చెపుతాను.. నీ బతుకు చెడగొట్టేస్తాను. స్టేట్ బోర్డర్‌కి కాదు, అదర్ స్టేట్ అంచులకి నిన్ను ట్రాన్సుఫర్ చేసేస్తాను... నన్నాపకండి.. ఆట్టైపిస్టుని పిలవండి'' గురుస్వామిని ఎవరూ ఆపకున్నా సరే జోనల్‌మేనేజర్ నటరాజయి నర్తించాడు.

క్రిష్ణమూర్తి కిక్కురుమనకుండా చూసాడు.

ఆ చూపు కూడా జోనల్‌మేనేజరుకు సహించలేదు. తట్టుకోలేక పోయాడు.

''నిన్నూ.. క్రిష్ణమూర్తీ ' ఒరే'... వింటున్నావా? నిన్ను ఉద్యోగంలోంచి సస్పెండు చేసి పీకేస్తాను.. నువ్వెవరి దగ్గర ఎంతెంత తిన్నావో నాకు తెలుసు. మీ బ్రాంచోళ్లందరూ అందుకు సాక్ష్యమిస్తారు... సంతకం చేస్తారు..'' జోనల్‌మేనేజరు మాటలు పూర్తికాలేదు.

''నేను సంతకం చేస్తాన్సార్...''

''మీరు ఎక్కడ సంతకంపెట్టమంటే అక్కడ కళ్ళుమూసుకొని పెడతాముసార్'

'' ఇలాంటోన్ని మీరు మంచి మనసుతో ఇన్నాళ్ళూ సహించారు..''

''తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందే.''

మనిషొకమాట మాట్లాడుతూ పెన్నులు పెతుకున్నారు క్రిష్ణమూర్తి నంప్పేందుకు రికమండు చేస్తూ జోనల్‌మేనేజరు కోరినట్టు సంతకాలకు సిద్ధమవుతూన్నారు.

'' ఉద్యోగం పోతే కారణం లలితే కాబట్టి. ఆమె, ఆమె తండ్రీ అందుకుబాధ్యులు. అంచేత వాళ్ళే ఏబిజినెస్ కయినా సొమ్ము పెట్టాలి.. ఈ కాలంలో రెండుమూడు లక్షలు లేనిదే చిన్న వ్యాపారం కూడా చెయ్యలేం...'' ఈ విధంగా వున్నాయి క్రిష్ణమూర్తి ఆలోచనలు.

తలుపులు కొడుతూ పిల్లలు 'నాన్నా... నాన్న' పిలుస్తున్నారు. లలిత 'ఏమండీ ఏమండీ' అంటోంది.

గదిలో వున్న వాళ్ళంతా నిశ్శబ్దమయిపోయారు.

క్రిష్ణమూర్తికి అంతాకలసి తనని బయటకు తోసేస్తారేమో నన్నఅనుమానం వచ్చింది. ఎలర్ట్ అయిపోయాడు. తన దారం ఎవరి చేతికీ దొరక్కుండా లాగకుండా ''మీరందరూ సాటి స్వాములని నామాట వినండి. వూతికగాడు నావల్ల చనిపోలేదు. వాడునాకు తమ్ముడు కాదు. అన్న అసలేకాదు. తండ్రి ఎలగా కాదు. ఏదీ కానివాడు చేసిందానికి మీలోని వాణ్ని నన్ను శిక్షించడం తగునా? తగదు... నేనేమిటో తెలుసుమీకు... నన్ను మా ఆవిడ కంటబడి అపవిత్రమైపోతే - పంచ గవ్యములతో పరిశుద్ధుని చేసి ఫలము దక్కించారు. నేనూ మీ ఋణం వుంచుకోలేదు... అసోసియేషన్‌వాళ్ళని పిలిచి ఆర్కెస్ట్రా పెట్టించాను. ఆ ఖర్చులన్నీ భరించాను. ఇప్పుడు మీరు నన్ను కాపాడితే శబరిమలై రానుపోనూ ఖర్చులన్నీ నావే..'' అన్నాడు.

అందరి ముఖాల్లో మళ్ళీ అప్యాయత కనిపించినా శాస్త్రిగారు ఆగలేదు. ''రిటన్లో రైలు బస్సు ఛార్జీలే కాదు.. మిగతా అన్నీ.. ఏమిటి... అన్నీ' నువ్వే చూసుకోవాలి సుమా ఎవరికేది కావాలంటే అది..'' సూపరెంటు లెవిల్లో చెప్పారు.

డిప్యూటి మేనేజరూ మిగతా స్టేపూ ''అలగయితేనే ఒప్పుకుంటా, లేదంటే..'' హెచ్చరించబోయారు.

క్రిష్ణమూర్తి అంగీకరిస్తూ తెల్లకాగితం మీద సంతకం చేసి ఇచ్చాడు.

అలా ఇచ్చాక - తమ సాటి భక్తుణ్ని ఎలా అయినా కాపాడుకోవాలన్చెప్పి అందరిలోనూ గొప్ప ధృడ సంకల్పమేర్పడింది.

ఆఫీసులో వస్తేస్తూ - వురిటిమైల వలన మాల వేయకుండా మిగిలిపోయిన మధుసూధనం ఇంకా పరమ నాస్తికుడైన గంగాధరం - స్వామి వర్గానికి - చావు వర్గానికి మధ్యన మధ్యవర్తులైనారు.

మధ్యలో తలుపులు..

తలుపుల మధ్యన మధ్యవర్తులు..

ఇటుమాటలటు అటుమాటలిటు కన్వే చేస్తున్నారు.

''పూతికగాడ్ని ఇక్కడకు తెచ్చింది తీసుకువచ్చింది మాల వేసుకున్న మీకందరికీ సేవలు చేయడానికే గదా...'' లలిత అడుగుతోంది.

''స్వామి సేవలు వూరకే పోవు... స్వామి ఆశీస్సులు వుంటాయి... ఆకట్టె'కు తిరుగులేదు...'' గురుస్వామి గోడచాటునుండే అన్నారు.

అలాగే మాటకు మాట తన ఆధ్యాత్మిక వాదంతో ఆయన జవాబిచ్చారు. దయ చేసి కట్టెను తీసుకు వెళ్ళమని కోరారు. 'ఒకరి నమ్మకాలనీ విశ్వాసాలనీ స్వేచ్ఛనీ వైవేచ్ఛనీ మరొకరు ఎదిరించి ఆటంకం కలిగించడం ప్రజాస్వామ్యంలో చట్టరీత్యా నేరం... ఆ నేరం చేయవద్ద'ని మనవి చేసి విన్నవించుకున్నారు. కట్టెను తీసుకు వెళ్ళడానికి ఆఫీసు జీపు ఇస్తున్నట్టు చెప్పి - ఆఫీసు జీపుకు సర్క్యులర్ ప్రకారం కిలోమీటరుకు రెండు రూపాయల డబ్బె అయిదువైసలు చొప్పున్న క్రిష్ణమూర్తి పేరున 'ఇన్వాయస్' రైజు చేయగలమని చెప్పారు.

లలిత ఆగి పోయింది.

పిల్లలు మాత్రం 'నాన్న... నాన్న' అనడం ఆపలేదు.

క్రిష్ణమూర్తి పలకడానికి గింజులాడి పోవడం చూసి గురుస్వామిగారే అన్నారు. 'బాబూ ఇంతకు మునుపు క్రిష్ణమూర్తి మీకుతండ్రి. ఆయనిప్పుడు ఒక స్వామి ... అతనికి స్వామి కార్య భంగం చేయకండి. అతనికిప్పుడూ తల్లీ తండ్రీ భార్యా బిడ్డలూ లేరు.. వున్నయెడల స్వార్ధపరుడై నిష్టకోల్పోవును..''

మాట్లాడుతూనే అది స్పీచిగా మారినపుడు గురుస్వామి మాటల వాక్యాలు మారిపోతుంటాయి. ఏమైనా క్రిష్ణమూర్తి మరోమారు గురుస్వామి జోనల్ మేనేజరు నటరాజుగారికి పాదాభివందనం చేసాడు.

పద్మపిల్లల్ని పిలుచుకు వెళ్ళింది.

మధ్యవర్తులు మధ్యలోనే మిగిలిపోయారు.

ఎప్పుడు కబురు వెళ్ళిందో.. డ్రైవరు జీపుతో సిద్ధమయాడు. అప్పటికి లలిత తండ్రి ఏకాంబరం మరో ఇద్దర్ని తోడ్చుకు వచ్చాడు. అందరూ కలసి పూతికగాడి శవాన్ని జీపు వెనక భాగంలో అతి కష్టంగా వంచి, పడుకోబెట్టారు. లలిత బయల్దేర బోయింది.

ఏకాంబరం అడ్డు చెప్పాడు ''వద్దమ్మా రేపే మీ ఆయన 'ఇరుముడి' అటగదా... ఆ వెంటనే ప్రయాణం. నువ్వుండాలి'' అన్నాడు. 'ఆడదానివి నువ్వు వచ్చి చేసేది లేద'న్నాడు. పిల్లలున్నాళ్ళన్నాడు. 'శీతకాలం చలి' అన్నాడు. అందుకుతోడు అర్ధరాత్రి శుంతో ప్రయాణం వద్దన్నాడు. పైగా జీపు ముందరి భాగంలో మరి కూర్చోవడానికిచోటులేదన్నాడు. బతికుంటేగాని

చచ్చేక ఎవరు వచ్చి చేసేది లేదన్నాడు. అంచేత 'అల్లుడుగారు శబరిమలైనుండి కార్యంనాటికి తిరిగి వచ్చేస్తారు. అప్పుడు రావచ్చునటగదా ఇద్దరూ కలసి పిల్లల్ని తీసుకురండి' అన్నాడు.

మొత్తానికి లలిత పిల్లలతో వుండిపోయింది.

జీపు భారంగా కదిలింది.

''పూతిక గాడు చచ్చిపోయాడు..'' మళ్ళీ నిట్టూర్చింది లలిత.

''నా దేవుణ్ణి బతికించుకున్నాను...'' అనుకోవడమేకాదు పైకే అన్నాడు క్రిష్ణమూర్తి.

జీపు దూరమవుతున్నట్టు హారన్‌మోత తగ్గుతోంది.

స్వామి షష్ హు(రేకలిపి 'స్వాము(రే..'' అని సంతోషం పట్టలేక అరిచాడు క్రిష్ణమూర్తి. పెద్ద ఆపద దాటినట్లు అందరూ గాలి పీల్చుకున్నారు.

అర్ధరాత్రి కావస్తుందేమో చలిలో వణుకుతు పిల్లలూ - దుఃఖంతో వణుకుతూ లలిత - దారితప్పినట్టు పద్మ ఇంటివేపు అడుగులు వేసారు.

* * *

సంక్రాంతి నాటికి శబరిమలై కొండమీద వుండి 'మకరజ్యోతి' చూడడానికి ఆరోజే ఇరుముడి వేసుకు బయల్దేరాలి కనుక అవాళ ఉత్సవం' జరుగుతున్నట్టే వుంది. మైకులూ పాటలూ భజనలూ కోలాహలం. జనం అటూ ఇటూ తిరుగుతున్న కల కలం..

ఇరుగూ పొరుగూ లలితను బయల్దేరించారు. లలిత అడ్డు చెప్పబోతే 'భార్యాభర్తలన్నాక సవాలక్ష గొడవలుంటాయి వదినా... ఇంటింటికీ వుంది మంటిపొయ్యి' అంది పసుపు గోరింటాకులా పచ్చగా పండినట్టున్న తన ముఖంచూసి తనే అద్దంలో చూసి మురిసిపోతూ అనసూయ.

' అయినా గొడవ భగవంతుడితోటి కాదు కదా, ఆమాటకొస్తే భార్యా భర్తల గొడవల ముందు బాగారోడిగొడవ ఏపాటి అంటారు... ఆపాటి వుండాలి..'' కమలాక్షి ఎప్పుడు వచ్చిందో అందుకుంది. వీధి వీధంతా బయల్దేరింది. పద్మని వాళ్ళ అమ్మానాన్నలు వచ్చి అల్లుడి ఇరుముడి చూడ్డానికి తీసుకు వెళ్ళారు.

పిల్లలంతా కొత్త బట్టలు. పండగవాతావరణం ముందే వచ్చేసినట్టుంది. పిల్లలు పారితే లలిత బయల్దేరింది.

'' ఈ అయ్యప్పస్వామి దయవల్లమా ఆయన ఆరోగ్యం బాగుంది. తాగుడు మానడానికి ఇంతకు మించిన మందులేదు...''

''తాగినోళ్ళు ఎప్పుడూతాగుతారు.. ఇప్పుడు నోరు కట్టేసుకున్నా మాల విప్పగానే నోటికున్న ముడులు వీడిపోతాయి... గొంతులు వంశధార గొట్టా బేరేజీలే..''

''దేవుడు తాగమనడు.. వద్దనడు..''

''మరేటంటాడు?...''

''మనకి బుద్ధుంటే బువ్వతింటాం, లేకపోతే గడ్డి తింటాం...''

''గవర్నమెంటు స్పెషలుగా రైళ్ళూ బస్సులూ వేసింది... లక్షలాది ప్రజ కోట్లాది జనం...''

మనుషులమధ్య మాటల మధ్య మూగదాన్లా లలిత నడుస్తోంది. పిల్లలు అనుసరిస్తున్నారు.

అందరూ ఎవరి భర్తల బృందాల దగ్గరికి వాళ్ళు విడిపోతున్నారు. లలిత అనాశక్తంగానయినా క్రిష్ణమూర్తి ఆఫీసులోకి నడిచింది. పూజాస్థలానికి దూరంగా నిలబడింది. ఆమేకాదు ఆడవాళ్ళందరూ దూరంగా నిల్చున్నారు.

గురుస్వామి కార్యక్రమం నిర్వర్తిస్తున్నారు. ముడులు వేస్తున్నారు.

కొబ్బరి కాయకుండే మూడు కళ్ళగుండా నెయ్యిపోసి వుంచుతున్నారు. ఒకరొకరూ తలకెత్తుకుంటున్నారు.

అందరిలానే క్రిష్ణమూర్తి అర్ధనగ్నంగా లుంగీతో అటూఇటూ హడావిడిగా తిరుగుతున్నాడు. లలితను చూసిచూడనట్టే వున్నాడు. ఆ చూపునకు ఉలిక్కిపడి పైట సర్దుకుంది. 'ఆడవాళ్ళు నిండుగా కప్పుకుంటే నిండుదనం' క్రిష్ణమూర్తి మాట గుర్తుకు వచ్చింది.

గురుస్వామి చెపుతున్నారు. భక్తికి ఎల్లలులేవు, ఇది కేరళకే పరిమితం కాదు తమిళనాట అచ్చం అప్పన్ అంటారని చెప్పారు. ఆయనలా విశిష్టతను చెపుతూ లలిత వకం చూసారు.

లలిత అడగకుండానే ''మనం ఒక్కభార్యనే భరించలేక పోతున్నాం, కాని స్వామి వారికిపూర్ణ పుష్కల, ప్రభ అని ముగ్గురు భార్యలు...'' ఎందుకో గురుస్వామి చెపుతున్నాడు.

'స్వామిని పూజించే స్వాములకు మాత్రం భార్యలుండకూడదు కదండీ..' అనుకుందేగాని లలిత అడగలేక పోయింది.

మిగతా తంతేదీ ఆమె తల కెక్కలేదు.

స్వాములగుంపు బయల్దేరింది.

రైలు... బస్సు.. ఎవరి మర్గాన వాళ్ళు....

లలిత పిల్లలతో వెనుదిరిగింది . అనుకోకుండా పద్మ దార్లోనే ఎదురైంది. వాళ్ళ అమ్మనాన్నల్ని పరిచయంచేసింది. వాళ్ళనీ పిల్లల్నీ అక్కడే నిలబడమంది. లలితను షాపులోకి రమ్మంది.

అప్పుడే ఎవరో అయిదేళ్ళ పసిపిల్లపై అత్యాచారం జరిపినందుకు నినాదాలు చేసుకుంటూ ర్యాలీ ఒకటి వెళుతోంది. ఇద్దరూ ఒక్కక్షణం ఆగి ఒకరి కళ్ళలోకి మరొకరు చూసుకున్నారు. వెనకే వచ్చితన చెయ్యి పట్టుకున్న గీత చేతిని భయంతో లలిత గట్టిగా పట్టుకుంది. ఆమె భయాల్లోకి క్రిష్ణమూర్తి ముఖం పెట్టి మాయమవు తున్నట్టు తోచింది. పద్మ కదిపితే తాను షాపులో వున్నట్టు గుమనించింది.

''మీరిచ్చిన కుక్కర్ ప్రెజర్ వాల్వ్ మళ్ళీ కొట్టేసింది...'' పద్మ షావతనితో అంటోంది.

''ప్రెజర్‌తో బంధించివుంచితే - దానికున్న ఔట్‌లెట్ చిన్నకన్నంలో కూడా ఏదో ఒకటి పడి అడ్డేస్తే ఏమవుతుంది.. ఏదయినా కొట్టేస్తుంది. అందువల్ల మనకు ప్రమాదం లేకుండ వుండాలంటే వున్న చిన్న కన్నం మూత పడకుండ చూసుకోవాలి...'' షావతను చెపుతూనే వున్నాడు.

'ప్రెజర్ కుక్కర్ గురించే చెపుతున్నాడా?' లలితకు అనుమాన మొచ్చింది.

• • •

క్రిష్ణమూర్తికి గురుస్వామి చెప్పిన పద్దెనిమిది మెట్లూ ఎక్కుతుంటే కాక దిగుతుంటే జన్మ జన్మల వాసనలూ వదిలిపోతున్నాయి. మెట్టుకో గుణం చొప్పున వివరించినవన్నీ విస్తరిస్తూన్నట్టే వున్నాయి. విద్య - అవిద్య రెండూ, పంచేంద్రియాలూ త్రిగుణాలూ అష్టరాగాలూ మొత్తం పెద్దెనిమిదీ ఏవేవో ప్రేరేపిస్తున్నాయి.

కొండ ఎక్కినప్పుడు కళ్ళుతిరగలేదు. అది దేవుని మహిమే కాని కొండ దిగుతుంటే ఏకంగా కొండేవూగింది. అసలు కొండేమిటి సమస్త ప్రకృతీ వూగింది. అందులో భాగంగానే తిరిగి వస్తున్న జీప్పీ వూగింది. జీప్పీలో వున్న గురుస్వామి.. ఇంక స్వామి ఏమిటి... ఛ..ఛ.. జోనల్‌మేనజరుగారూ ఊగారు. నూపరెంటు స్వామి, డిప్యూటిమేనేజరు స్వామి.. ఈ స్వామి అలవాటయిపోయిందిరా బాబోయ్.. ఈబాబా ఆబాబా అవతల అవతార్ బాబా అందరూ వూగుతున్నారు డ్రైవరూ ఊగుతున్నాడు.

తన ఒళ్ళూ పులకించి వూగుతోంది.

ఈ వూగడం కొండ దిగుతూనే ప్రారంభమయింది. మద్రాసులో తీసుకున్న లాడ్జీ అయితే ఉయ్యాల లాగనే వూగింది. వర్మగారు తెచ్చిన అమ్మాయిలయితే ఉయ్యాల్లో పాపల్లాగానే వూగారు.

చేపల్లాగనే ఈదరు. ఎండాకాలం దాహమంత వానకాలం తీర్చి నట్టుంది. అయితే ఎక్కడో చెరువుకి గండిపడింది. కాదు, లేదు. పి.ఎఫ్. ప్రావిడెంట్‌ఫండ్‌కు గండి పడింది..

వరద... వరద... వరద..

అన్నీ కొట్టుకు పోతున్నాయ్..

అందరూ కొట్టుకుపోతున్నారు.

క్రిష్ణమూర్తి కొట్టుకు పోయాడు. పోయిపడ్డాడు. కిందపడ్డ క్రిష్ణమూర్తిని కాంపౌండర్లూ నర్సులూ అమాంతం ఎత్తి బెడ్‌మీద వేసారు.

'' ఇంకా వూగడం తగ్గలేదు..'' అనుకున్నారు హాస్పిటల్ స్టాఫ్.

తాళ్ళతో కట్టేసినట్టు చేతులూ కళ్ళూ ఎడంగా చాపి వేలాడదీసి వీపూ తలా పరుపుకు ఆనినట్టుగా పడుకోబెట్టారు. ఒళ్ళంతా కట్టిన సిమెంటు కట్లు విరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ''వంట్లో ఇంకా విరగడానికేం లేవు.. పదేపదే కట్టలేం చేతులు పీకుతున్నాయి..'' హెడ్‌నర్స్ తిడుతోంది.

క్రిష్ణమూర్తి కళ్ళు మూసుకున్నాడు.

ఇలాగే ఊగడం... ఊగి.. ఊగి తుప్పల్లో పడ్డాడుతను. తనకాళ్ళ దగ్గర జోనల్ మేనేజరు.. అచ్చం విష్ణుమూర్తి కాళ్ళదగ్గర లక్ష్మీదేవిలాగ. ముడ్డిదగ్గర శాస్త్రి.. నడ్డి దగ్గర వర్మ... తన కింద బెడ్‌లాగ గోవర్ధనం.... అందరూ చుట్టూ చెల్లా చెదురుగా పడి 'మానవహారం' కట్టినట్టు తోచింది... ఆ అద్భుతమైన దృశ్యం కళ్ళారా చూడకుండానే కాళ్ళదగ్గరున్న జోనల్‌గాడు కాలు పీనకలేదు సరే, కండ పీకేసాడు కుక్కలాగ..

''నీవల్లే నిష్ఠ చెడింది... మీ ఆవిడే శూన్ని తెచ్చి భక్తికి పంచనామా చేసింది... ఆపాపమే ఇలా కొట్టింది....''

మూలగడం మానేసి జాతీయ ఐక్యతా గీతం పాడుతున్నట్టుగా అందరిదీ ఒకటే మాట.. ఒకే రాగం...

కొబ్బరిలో వేసిన నెయ్యితో ఇరుముడిని పవిత్రంగా మోసుకెళ్ళాడు. లేకపోతే కొబ్బరి కళ్ళగుండా వేసిన నెయ్యి పల్చగవలేదు, చిక్కగా వుంది. అంటే నిష్ఠగా వున్నట్టే కదా.. అదేవిషయం అంతబాధలోనూ అడిగితే అజోనల్‌గాడు మరో పిక్క పీకేసాడు... వాడి పళ్ళు పార పళ్ళు!

క్రిష్ణమూర్తి ఒళ్ళంతా కట్లున్నా అదృష్టవశాత్తూ స్వామి కటాక్ష వీక్షణాలతో కళ్ళు మిగిలాయి.

'లేపోతే చచ్చానని కళ్ళు డొనేట్ చేయమని వచ్చాడా వాడెవడో...?' తలచాడు.

తేరిపార చూసాడు క్రిష్ణమూర్తి . కళ్ళదగ్గర కట్లు కప్పక పోయినా వాపులు కళ్ళని కప్పేసాయి. అందుకే వచ్చింది లలితనుకొని కొట్టడానికి చేతులు లే(రా) క నాలుక బయటికి తీసి వెక్కిరించినందుకు – ఆముసిలి నర్సు చెప్పుతీసి కొట్టింది... ప్ప్...

' ఇప్పుడు ఫరవాలేదు. దీక్షలో లేంగదా?' అనుకున్నాడు.

చెవులు దగ్గర గాలి సోకేలా, కట్లు కట్టడం వల్ల క్రిష్ణమూర్తికి వినిపిస్తోంది...

చెప్పుల చప్పుడు... తన బెడ్ చుట్టూనే. కళ్ళు తెరవడానికి ధైర్యం చాలలేదు. జాగ్రత్తగా వింటున్నాడు.

పేపర్లో చదివి వచ్చారట.

లలితా పిల్లలూ ఇంకా అత్తమామలు అంత మొత్తం బెటాలియన్ దిగిపోయినట్టుంది. క్రిష్ణమూర్తి సిగ్గుపడి ' ఈ ముఖం ఎలా దాచుకోవడం' అనుకున్నాడు.

''ముఖం అస్సలు కనపడ్డం లేదు...'' అంది అత్త పార్వతమ్మ.

'' అవును కనపడ్డం లేదు'' అన్నాడు ఏకాంబరం.

'' పళ్ళు వున్నాయో విరిగి పోయాయో..'' అంది అనుమానంతో పార్వతమ్మ. క్రిష్ణమూర్తి సిగ్గుతో - పళ్ళు అవుపడకుండ పెదవులతో ముయ్యాలనుకొని ప్రయత్నించాడు. సిమెంట్ కట్టు కదిలి ఎక్కడో 'కరల్ మంది.

'' అల్లుడు ఒళ్ళు చేసారేటమ్మాయ్.. ఈమధ్య చూడలేదు..'' పార్వతమ్మ ఏదో ఒకటి అడగాలని - పరామర్శించి - మాటలాడి - అల్లుడి నొప్పులు మరిపింపజెయ్యాలని అడుగుతోంది.

''రెండు బస్తాల సిమ్మెంటు మీ అల్లుడి వంటిసే వుందమ్మా... రఃయన కేసిన సిమ్మెంటూ ఇతగానితోవున్న స్వాములకేసిన సిమ్మెంటుతో కొత్తహాస్పిటల్ కట్టొచ్చు'' ఇందాక చెప్పుతో కొట్టిన ముసల్దే మాటల్తో ఈ టెమిసిరింది. సిగ్గున్నా చర్మం లేదు గనుక - వున్నా అదంతా సిమ్మెంటే గనుక బాధ పడకూడదు అనుకున్నాడు క్రిష్ణమూర్తి.

లలిత ఒక్క మాటా మాట్లాడక పోవడం క్రిష్ణమూర్తికి విడ్డూరమనిపించిడమే గాక ఈ తతంగ మంతటికీ తానే మూలకారణ మనిపించింది. అప్పుడు మాల అడ్డేసింది... ఇప్పుడు ఈ సిమ్మెంటు కట్లు అడ్డేసాయి. ఆపేసాయి...

''పెళ్ళండమ్మా...'' అంటూ ఏకాంబరం మనుమల్ని ముందుకు తోసాడు. వచ్చిన దగ్గర్నుంచీ రెప్ప ఆర్పకుండా చూస్తున్న గోపి దగ్గరగా చూడ్డంతో, పైగా సిమెంటు కట్లని తాకడంతో 'దెయ్యం...' అని పెద్దగా అరిచాడు.

క్రిష్ణమూర్తి ట్యూబ్లైట్లవెలుగులో పిండారబోసినట్లున్నాడు. ఆ వెలుగు కళ్ళు వట్టనిది.

గీత కూడా ''తాతయ్యా ఇది దెయ్యమా'' అని అడిగింది.

పిల్లలెక్కడ భయపడి జ్వరం పెట్టుకుంటారోనని లలిత దగ్గరగా వచ్చి ''తప్పమ్మా దెయ్యం కాదు...'' అనునయించింది.

''దెయ్యం కాదమ్మా... నాన్నని దెయ్యం అనొచ్చా? తప్పు... తప్పు.. లెంపలువేసుకో ఇప్పుడు చెప్పు. నాన్న దేవుడు...'' అన్నాడు ఏకాంబరం మనుమల్ని ఊరడిస్తూ.

క్రిష్ణమూర్తి నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. తన తోటి స్వాములందరూ పాడిన జాతీయగీతం పతాక అయిన లలిత కోసం పెదికాడు. కాళ్ళ దగ్గరేవుంది. తట్టుకోలేకపోయాడు. తందుమా అనిపించి అలవాటుగా కాలు కదిల్చాడు. కట్టిన తాళ్ళు తెగిపోయాయి. తాళ్ళకి కట్టిన ఇనుపస్టేండూ కాలిమీద పడింది. కలుక్కుమంది.

మూలగడమో... అరవడమో.. ఏమో.. క్రిష్ణమూర్తి వింత శబ్దం చేసాడు. ఆ శబ్దం ఆగదిలో మార్మోగి ఆదోరకంగా వినిపించింది. అదివిని 'దెయ్యమే' అన్నారు పిల్లలు మళ్ళీ.